# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 112, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం -12 - జూలై - 2025


## ఐడీ కార్డులు అడిగి మరీ చంపారు!

### పాకిస్థాన్ లో రెబెల్స్ దాడి...




బలూచిస్తాన్ ప్రావిన్స్ లో ఘటన
బలూచ్ కు చెందని వారిని లక్ష్యంగా చేసుకున్న మిలిటెంట్లు
9 మందిని కాల్చి చంపిన వైనం
దాడికి బాధ్యత తమదేనన్న బలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్

## మహిళా అధికారులను 'సర్' అని సంబోధించాలన్న ఆదేశాలను రద్దు చేసిన బంగ్లాదేశ్ ప్రభుత్వం




తనతోపాటు మహిళా అధికారులను 'సర్' అని సంబోధించాలని హసీనా ప్రభుత్వం ఉత్తర్వులు
ఆ ఆదేశాలను రద్దు చేసిన బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం
ఎలా పిలవాలన్న దానిపై ప్రత్యేక కమిటీని నియమించిన వైనం

## పాకిస్థాన్ దాడిలో భారత్‌కు నష్టం కలిగిందన్న విదేశీ మీడియా ప్రచారంపై స్పందించిన అజిత్ దోవల్

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు నష్టం జరిగిందని విదేశీ మీడియా ప్రచారం




ఒక్క ఆధారం చూపించాలని అజిత్ దోవల్ సవాల్
మన సైన్యం, బ్రహ్మోస్ ఉగ్రస్థావరాలను మట్టుబెట్టాయన్న దోవల్

## బీసీ రిజర్వేషన్లపై మంత్రి చెప్పారు కానీ, కొన్ని అనుమానాలు ఉన్నాయి: కవిత




- ఆర్డినెన్స్ తీసుకు వస్తామని చెప్పినందున రైల్ రోకోను వాయిదా వేస్తున్నట్లు కవిత వెల్లడి
- ఆర్డినెన్స్ తేవాలనుకుంటే 18 నెలలు ఎందుకు ఆగారని ప్రభుత్వానికి నిలదీత
- వారం రోజుల పాటు ప్రభుత్వం కార్యాచరణను గమనిస్తామన్న కవిత

## టీటీడీలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలి

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బండి సంజయ్
టీటీడీలో వెయ్యి మందికి పైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్న
వారిని ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్



హైదరాబాద్: టీటీడీలో అన్యమతాలకు చెందిన ఉద్యోగులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వెయ్యి మందికి పైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆ ఆనవాయతీని ఎందుకు కొనసాగిస్తున్నారని అన్నారు. అన్యమతస్తులను వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా మిగతా..2లో

## త్వరలో 22,033 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు..

# జాబ్ కేలండర్ రెడీ



- ★ మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాల భర్తీ
- ★ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కోటా
- ★ పంచాయతీరాజ్ చట్ట సవరణకు త్వరలో ఆర్డినెన్స్
- ★ సీఎం అధ్యక్షతన జరిగిన భేటీలో కేబినెట్ కీలక నిర్ణయాలు
- ★ వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం, వాకిటి
- ★ అమిటీ, సెయింట్ మేరీస్ విద్యా సంస్థలకు వర్సిటీ హోదా
- ★ పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సత్వరమే పూర్తి
- ★ మత్స్యశాఖ బడ్జెట్ రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంపు

హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పంచాయతీరాజ్ చట్టం - 2018 సవరణకు త్వరలో ఆర్డినెన్స్ తీసుకురావాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విలేకరులకు వివరాలు వెల్లడించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీతో పాటు కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం రాష్ట్రంలో కుల గణన నిర్వహించడాన్ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు మిగతా..2లో

## రోహిత్ వేముల మరణానికి కారణమైన రామచందర్ రావుకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఎలా ఇస్తారు?




- రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తమ ప్రభుత్వం విచారణ జరుపుతోందన్న భట్టి
- త్వరలోనే రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తామని వెల్లడి
- రోహిత్ కుటుంబాన్ని కేసీఆర్ పరామర్శించలేదని విమర్శ

## ఈనెల 14న తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా రేషన్‌కార్డుల పంపిణీ







## పీ 4 మార్గదర్శులతో త్వరలో సీఎం చంద్రబాబు భేటీ

- పీ4 - జీరో పావర్టీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన సీఎం
- మార్గదర్శులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్న సీఎం
- పేదల కోసం పెద్దలను ఆశ్రయిద్దామన్న సీఎం

## హైకోర్టులో సిద్ధరామయ్యకు ఊరట




కాంగ్రెస్ నేతలపై బీజేపీ పరువునష్టం దావా
'అవినీతి రేటు కార్డు' ప్రకటనపై బీజేపీ దావా
కేసును తాత్కాలికంగా నిలిపివేసిన హైకోర్టు

## వ్యాపారాలకేమో

# హిందీ కావాలి...

### మరి హిందీ నేర్చుకోవడానికి ఇబ్బంది ఏంటి...?

హైదరాబాదులో రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకలు
హాజరైన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
హిందీ దేశ భాష అని వెల్లడి
హిందీ నేర్చుకుంటే మరింత బలపడతామని స్పష్టీకరణ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాష యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఐటీ రంగంలో విజయం సాధించడానికి ఆంగ్లం ఎంత ముఖ్యమో, దేశంలో ఎక్కువ మంది మాట్లాడే హిందీని నేర్చుకోవడం వల్ల కూడా అంతే ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దక్షిణ భారతీయ సినిమాలలో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం మిగతా..2లో

## శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం.. 3 గేట్లు ఎత్తి నీటి విడుదల



సున్నిపెంట సర్కిల్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 1,75,233 క్యూసెక్కులు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్ ఫ్లో 1,70,347 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు నుంచి 20,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 32,237 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మూడు స్పిల్‌వే గేట్లు ఎత్తి 81,195 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.80 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 203.42 టీఎంసీలకు చేరింది.

## ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం...

## నీట మునిగిన పలు గ్రామాలు

## మహారాష్ట్ర, తెలంగాణలో వర్షాలు




గోదావరికి పోటెత్తుతున్న వరద నీరు
ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తివేత

## రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై

# ఫోకస్ పెట్టాం




మన దేశానికి అతిపెద్ద ఆర్థిక వనరు జనాభానే అన్న చంద్రబాబు
అమెరికాలో ఫర్టిలిటీ రేటు 1.62 శాతమేనన్న సీఎం
జనాభా పెరుగుదలను తాను సమర్థిస్తున్నానని వ్యాఖ్య

అమరావతి: మన దేశానికి అతి పెద్ద ఆర్థిక వనరు జనాభా అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో జనాభా పడిపోతోందని చెప్పారు. అతి ఎక్కువ జనాభా ఉన్న దేశం భారతదేశం అని అన్నారు. మన దేశ జనాభా 143 కోట్లు కాగా... చైనా జనాభా 130 కోట్లు అని చెప్పారు. అమెరికాలో ఫర్టిలిటీ రేటు 1.62 శాతం మాత్రమేనని.... 2.1 శాతం ఫర్టిలిటీ రేటు ఉంటేనే రీప్లేస్ మెంట్ ఉంటుందని... లేకపోతే రోజురోజుకూ జనాభా తగ్గిపోతుందని తెలిపారు. మన దేశంలో బీహార్ లో ఫర్టిలిటీ రేటు 3 శాతంగా మిగతా..2లో

# ఐడీ కార్డులు అడిగి మరీ చంపారు!

## పాకిస్థాన్ లో రెబెల్స్ దాడి...

ఢిల్లీ: పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో గురువారం రాత్రి ప్రయాణికుల బస్సులపై తిరుగుబాటుదారులు దాడి చేసి 9 మందిని కాల్చి చంపారు. పంజాబ్ ప్రాంతానికి చెందిన వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసిన తర్వాత బాధితులను లక్ష్యంగా చేసుకున్నారని సమాచారం. డాన్ వార్తాపత్రిక కథనం ప్రకారం, క్వెట్టా నుండి పంజాబ్‌కు వెళుతున్న రెండు బస్సులను లోరలై-జోబ్ హైవేపై సుర్-డక్తై సమీపంలో అడ్డగించారు. సాయుధులు రోడ్డును బ్లాక్ చేసి, వాహనాల్లోకి ఎక్కి ప్రయాణికుల జాతీయ గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. పంజాబ్‌కు చెందిన వారిగా గుర్తించిన వారిని తుపాకీతో బెదిరించి కిందకు దించి, ఆ తర్వాత చంపేశారు. స్థానిక అధికారి నవీద్ ఆలం ఏఎఫ్ పీ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "ఉగ్రవాదులు రెండు ప్రయాణికుల బస్సులను హైవేపై ఆపి, తొమ్మిది మంది ప్రయాణికులను కిందికి దించారు. వారిని సమీప ప్రాంతానికి తీసుకెళ్లి అందరినీ చంపేశారు" అని తెలిపారు. జిల్లా అడ్మినిస్ట్రేటర్ సాదత్ హుస్సేన్ మృతదేహాలను రోడ్డు పక్కన గుర్తించినట్లు ధృవీకరించారు. "మృతదేహాలన్నీ పంజాబ్‌లోని వేర్వేరు ప్రాంతాలకు చెందినవారని బలగాలు గుర్తించాయి" అని ఆయన మీడియాకు చెప్పారు. "ఉగ్రవాదులు ప్రయాణికుల గుర్తింపు పత్రాలను కూడా తీసుకెళ్లి ఉంటారు" అని నవీద్ ఆలం డాన్‌తో అన్నారు. కాగా, బలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ ఈ దాడికి బాధ్యత వహించింది. ఈ సంస్థ పాకిస్తాన్ ప్రభుత్వంపై చాలా కాలంగా తిరుగుబాటు చేస్తోంది. బలూచ్ కు చెందని పౌరులు మరియు సైనిక సిబ్బందిని లక్ష్యంగా చేసుకుంటోంది. ఇస్లామాబాద్ నుంచి స్వాతంత్ర్యం కోసం బలూచ్ తిరుగుబాటు ఇటీవల సంవత్సరాలలో తీవ్రమైంది. అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఈ హత్యలను ఖండించారు. దేశాన్ని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్న నిషేధిత బలూచిస్తాన్ ఉగ్రవాదులే దీనికి కారణమని ఆయన ఆరోపించారు. గత సంవత్సరం జరిగిన ఇలాంటి దాడిలో 23 మంది ప్రయాణికులు మరణించారు.

## మహిళా అధికారులను 'సర్' అని సంబోధించాలన్న

# ఆదేశాలను రద్దు చేసిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా సహా ప్రభుత్వంలోని మహిళా ఉద్యోగులను 'సర్' అని సంబోధించాలన్న ఆదేశాలను మధ్యంతర ప్రభుత్వం రద్దుచేసింది. నిన్న జరిగిన అడ్వైజరీ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తనను 'సర్' అని సంబోధించాలని హసీనా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఆ తర్వాత మహిళా అధికారులను కూడా అలాగే సంబోధించాలంటూ ఆదేశించారు. హసీనా 16 ఏళ్ల పాలనలో ఇలాగే పిలిపించుకున్నారు. ఇప్పటికీ అక్కడ మహిళా అధికారులను 'సర్' అనే సంబోధిస్తున్నారు. ఇలా పిలవడం సామాజికంగా, సంస్థాగతంగా అనుచితమైనదని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆ ఆదేశాలను వెనక్కి తీసుకుంటున్నట్టు చీఫ్ అడ్వైజర్ కార్యాలయం ప్రకటించింది. అంతేకాదు, భవిష్యత్తులో అధికారులను ఎలా సంబోధించాలన్న దానిపై రివ్యూ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపింది. ఎనర్జీ, రోడ్లు, రైల్వేలు, పర్యావరణం, నీటి వనరులపై సలహాలు ఇచ్చే సైదా రిజ్వానా హసన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీ నెల రోజుల్లో నివేదికను అందించాలని ఆదేశించింది. కాగా, సలహా మండలి సమావేశంలో 'సర్' అని పిలవాలనే నియమాన్ని రద్దు చేయడంతోపాటు ఇతర సంక్లిష్టమైన ప్రొటోకాల్ నియమాలను కూడా సమీక్షించాల్సిన అవసరాన్ని చర్చించారు. కొత్తగా ఏర్పడిన కమిటీ వాటిని కూడా పరిశీలించి తగిన మార్పులను సూచిస్తుంది.

## పాకిస్థాన్ దాడిలో భారత్‌కు నష్టం కలిగిందన్న విదేశీ మీడియా ప్రచారంపై స్పందించిన అజిత్ దోవల్

ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ దాడిలో భారత్‌కు నష్టం వాటిల్లిందంటూ విదేశీ మీడియా చేస్తున్న ప్రచారంపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్ దాడుల్లో భారత్‌కు నష్టం జరిగిందని ఒక్క ఆధారం చూపించాలని ఆయన సవాల్ విసిరారు. చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించినట్లు చెప్పారు. మన సైన్యం పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టిందని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో విదేశీ మీడియా చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు నష్టం వాటిల్లిందని చేస్తున్న ప్రచారం సరికాదని అన్నారు. అదే సమయంలో పాకిస్థాన్, పీవోకేలలో ఉగ్రవాద స్థావరాలను గుర్తించి మన సైన్యం కచ్చితత్వంతో దాడులు నిర్వహించిందని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి ఫొటోలు కూడా బయటకు వచ్చాయని తెలిపారు. భారత్‌కు నష్టం జరిగినట్లు ఒక్క ఫొటో కూడా బయటకు రాలేదని, నిజంగానే నష్టం జరిగిందని భావిస్తే ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఆయుధ సంపత్తిని దేశీయంగా రూపొందిస్తోందని అజిత్ దోవల్ తెలిపారు. మన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌లోని పలు వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాయని అన్నారు. ఢిల్లీ లక్ష్యంగా పాకిస్థాన్ ప్రయోగించిన ఫతాహ్11 బాలిస్టిక్ క్షిపణులను భారత్ బలగాలు మధ్యలోనే సమర్థవంతంగా పేల్చివేశాయని తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లపై మంత్రి చెప్పారు కానీ,

# కొన్ని అనుమానాలు ఉన్నాయి: కవిత

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పడం సంతోషకరమని, అయితే తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అందుకే ఈ నెల 17న తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆర్డినెన్స్ జారీ చేసిన వెంటనే రిజర్వేషన్లను అమలు చేయగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు ఎందుకు వేచి చూసిందని కవిత ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని తాము భావిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తోందని ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయని కవిత అన్నారు. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, కాబట్టి తలుచుకుంటే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వవచ్చని అన్నారు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తప్పులన్నీ కాంగ్రెస్ పైకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమోనని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆమె అన్నారు. బీసీ బిల్లును షెడ్యూల్ -9లో పెట్టాలని, దీని కోసం బీసీ బిడ్డ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని కవిత విజ్ఞప్తి చేశారు. ఆర్డినెన్స్ తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినందున, ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనించి, అందుకు అనుగుణంగా తాము నిర్ణయం తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

## రోహిత్ వేముల మరణానికి కారణమైన రామచందర్ రావుకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఎలా ఇస్తారు?

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన రామచందర్ రావును రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారని ఆయన ప్రశ్నించారు. రోహిత్ మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోకుండా... పదవులు ఇస్తున్న బీజేపీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తమ ప్రభుత్వం విచారణ జరుపుతోందని భట్టివిక్రమార్క తెలిపారు. న్యాయశాఖ దీనిపై పని చేస్తోందని చెప్పారు. త్వరలోనే తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తామని వెల్లడించారు. రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన బండారు దత్తాత్రేయకు గవర్నర్ పదవి, రామచందర్ రావుకు రాష్ట్ర అధ్యక్ష పదవి, ఏబీవీపీ నాయకుడు సుశీల్ కుమార్ కు ఢిల్లీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవి ఇచ్చారని మండిపడ్డారు. దేశంలోని దళితులు, ఆదివాసీలకు గౌరవం లేకుండా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారికి బీజేపీ పదవులు ఇస్తుందని దుయ్యబట్టారు. వందల ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయని... బీజేపీ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరమని చెప్పారు. ప్రతి పౌరుడి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై కూడా భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. రోహిత్ వేముల చనిపోతే ఆయన కుటుంబాన్ని కేసీఆర్ కనీసం పరామర్శించలేదని విమర్శించారు. యూనివర్సిటీల సంక్షేమాన్ని ఏ రోజూ పట్టించుకోలేదని మండిపడ్డారు.

# హైకోర్టులో సిద్ధరామయ్యకు ఊరట

కర్ణాటక: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసును హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. 2023 ఎన్నికల సమయంలో... 'అవినీతి రేటు కార్డు' ప్రకటనపై బీజేపీ పరువునష్టం కేసు దాఖలు చేసింది. ఇందులో సిద్ధరామయ్య, రాహుల్ గాంధీ, డీకే శివకుమార్ పేర్లను చేర్చింది. బీజేపీ లంచం తీసుకున్నట్టు 2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వంలో పదవులు, కాంట్రాక్టులకు లంచాల రేట్లను నిర్ణయించిందని ఆరోపించింది. ఈ ప్రకటన ద్వారా తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశారంటూ బీజేపీ పరువునష్టం దావా వేసింది. ఈ కేసును ధర్మాసనం తాత్కాలికంగా నిలిపివేయడంతో కాంగ్రెస్ నేతలకు భారీ ఊరట లభించింది.

## ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం...

# నీట మునిగిన పలు గ్రామాలు

## మహారాష్ట్ర, తెలంగాణలో వర్షాలు

ధవళేశ్వరం: మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరద తాకిడి పెరగడంతో అధికారులు బ్యారేజీ మొత్తం 175 గేట్లను ఎత్తేశారు. దీంతో 2,00,600 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళుతోంది. వరద కారణంగా పలు లంక గ్రామాలు నీట మునిగాయి. కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల్లో నీరు చేరుతోంది. నాలుగు గ్రామాలకు బయటి ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. అత్యవసరమైన వారు పడవలపై ప్రయాణం చేస్తున్నారు.

# వ్యాపారాలకేమో హిందీ కావాలి...

మొదటి పేజి తరువాయి



దక్షిణ భారతీయ సినిమాలలో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం వస్తుందని గుర్తు చేశారు. వ్యాపారానికి హిందీ అవసరమైనప్పుడు, నేర్చుకోవడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. తన సినిమాలో "ఏ మేరా జహా" అనే హిందీ పాట పెట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ, మాతృభాష తెలుగు అయినప్పటికీ, హిందీ దేశ భాష అని చెప్పడానికే అలా చేశానని తెలిపారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోవడం కాదని, మరింత బలపడటమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మరో భాషను అంగీకరించడం ఓటమి కాదని, కలిసి ప్రయాణించడమని ఆయన ఉద్ఘాటించారు. విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి వంటి రంగాలలో భాషా అవధులు చెరిగిపోతున్న ఈ సమయంలో హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి మాతృభాషల పట్ల గౌరవం ఉండాలని చెబుతూనే, హిందీని పెద్దమ్మ భాషగా అభివర్ణించారు. ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృభాష ఉండగా, దేశ సరిహద్దులు దాటితే హిందీ రాజ్య భాషగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం విడిపోవడానికి కారణాలు వెతుకుతుంటే, భారతదేశం మాత్రం ఒకే భాషతో ఏకం కావాలని చూస్తోందని, అది హిందీతో సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఒక బెంగాలీ గీతం జాతీయ గీతమైందని, ఒక పంజాబీ దేశం కోసం పోరాడారని, రాజస్థాన్‌కు చెందిన రాణాప్రతాప్ శౌర్యానికి చిహ్నంగా నిలిచారని, తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ అయ్యారని, మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన వ్యక్తి రూపొందించిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి భాషా జీవ భాష, మాతృ భాష అయినప్పటికీ, రాజ్య భాష మాత్రం హిందీయేనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# త్వరలో 22,033 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు..జాబ్ కేలండర్ రెడీ



రాష్ట్రంలో కుల గణన నిర్వహించడాన్ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించిన విషయం గుర్తు చేశారు. సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఇతర మంత్రులు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ పలువురు కేంద్రమంత్రులు, సంబంధిత అధికారులతో దీనిపై అనేకసార్లు చర్చించినా కొర్రీలు వేస్తూ కాలయాపన చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ భేటీకి అడ్వొకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి ఆయన సలహాలు తీసుకుని, న్యాయపరమైన చిక్కులు రాకుండా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎన్నికలకు ఇబ్బందులు ఎదురవకుండా రాజకీయ పార్టీలు కూడా చిత్తశుద్ధితో సహకరించాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి ఇప్పటికే రాష్ట్రంలో 62 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, రిజర్వేషన్లపై 50 శాతం క్యాప్ నిబంధన దేశంలో ఎప్పుడో పోయిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దీనికి ముందు వరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో 327 అంశాలపై చర్చించి 321 అంశాలపై నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. తాజాగా జరిగిన 19వ సమావేశంలో ఆ నిర్ణయాల అమలులో పురోగతిపై విస్తృతంగా చర్చించామని, 96 శాతం అంశాలకు సంబంధించి జీవోలు జారీ చేసి అమలు దశకు తీసుకెళ్లినట్టు తేలిందని చెప్పారు. కాగా ప్రతి రెండు వారాలకు ఒకసారి కేబినెట్ సమావేశం నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన మేరకు మళ్లీ ఈ నెల 25న మంత్రివర్గ భేటీ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి 3 నెలలకోసారి ఆ కాల వ్యవధిలో జరిగే ఆరు కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించాలని కూడా నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు చేరవేసే వ్యవస్థ పనితీరును మళ్లీ కేబినెట్‌లోనే ఇలా సమీక్షించడం దేశంలోనే తొలిసారి అని అన్నారు. రాష్ట్రంలోని అమిటీ, సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ విద్యా సంస్థలకు వర్సిటీలుగా గుర్తింపు కల్పించాలని కేబినెట్ నిర్ణయించినట్టు పొంగులేటి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 15 ఉత్తమ వర్సిటీల్లో అమిటీ 11/12వ స్థానంలో ఉందన్నారు. సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ సైతం అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వనుందని చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్ చొరవతో ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించడానికి ఆ సంస్థల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, వీటితో పాటు మరో 17,084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని పొన్నం చెప్పారు. ఇక కొత్తగా 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు జాబ్ కేలెండర్ సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. వచ్చే మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించామన్నారు. ఎస్సీల వర్గీకరణ సమస్యతో నోటిఫికేషన్ల జారీలో కొంత జాప్యం జరిగిందని ఆయన వివరించారు. రాష్ట్రంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన మిగులు భూసేకరణను సత్వరం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. అనంతరం ఆ ప్రాజెక్టుల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్టు పొంగులేటి వెల్లడించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జెడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జెడ్పీ ఛైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా పరిగణించి బీసీ రిజర్వేషన్లు కల్పిస్తారు. సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ కమిటీ వచ్చే కేబినెట్ సమావేశంలోపు తమ నివేదికను అందించాలని గడువు నిర్ణయించింది. సీఎం ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు. రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. కగా హైదరాబాద్‌లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకార సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చెరువులు, కుంటల్లో 80%-%110 మి.మీ. సైజు గల 82 కోట్ల చేప పిల్లలను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన బడ్జెట్‌ను రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని కమిటీని ఆదేశించింది.

## పీ 4 మార్గదర్శులతో త్వరలో

# సీఎం చంద్రబాబు భేటీ

అమరావతి: పీ4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కీలక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో మార్గదర్శకులతో సమావేశం కానున్నారు. పీ4 - జీరో పావర్టీ కార్యక్రమంపై నిన్న తన క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పీ4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమంలో మార్గదర్శకులుగా ఉండేందుకు 18,332 మంది ముందుకు వచ్చారు. వీరిలో పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, ఉన్నత వర్గాల వారు ఉన్నారు. వీరి ద్వారా 1,84,134 బంగారు కుటుంబాలకు చేయూత లభిస్తోంది. ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడంతో పాటు మార్గదర్శిగా ఉండేవారిని ప్రోత్సహించేందుకు పలు చర్యలు చేపట్టాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. మార్గదర్శులుగా ఉండేవారిని ప్రోత్సహించడానికి స్వయంగా వారితో చంద్రబాబు సమావేశం కానున్నారు. మార్గదర్శులుగా ఉండే 200 మంది టాప్ ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు, భారీ నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఎంఎన్సీ కంపెనీల ప్రతినిధులు, సెలబ్రిటీలతో సీఎం సమావేశం కానున్నారు. ఈ నెల 18వ తేదీన అమరావతిలో వీరిని విందుకు ఆహ్వానించాలనే అంశంపై ఈ సమీక్షలో చర్చ జరిగింది. పీ4 లక్ష్యాలను వివరించి మరింత మందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. సమాజంలో పేదలకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్న అనేక వర్గాల వారిని ఒక తాటిపైకి తెచ్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని సీఎం భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 14న తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి

# చేతులమీదుగా రేషన్‌కార్డుల పంపిణీ




హైదరాబాద్: తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల జారీకి ముహూర్తం ఖరారైంది. ఈనెల 14న తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.4లక్షల కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు. దీని ద్వారా 11.30లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రంలో గత ఆరు నెలల్లో 41 లక్షల మందికి ప్రభుత్వం కొత్తగా రేషన్ పంపిణీ చేసింది. త్వరలో పంపిణీ చేయనున్న వాటితో కలిపి రేషన్‌కార్డుల సంఖ్య 94,72,422కి చేరనుంది. మొత్తంగా 3.14కోట్ల మందికి లబ్ధి చేకూరనుంది

# టీటీడీలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలి

మొదటి పేజి తరువాయి



తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తిరుమల వచ్చారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ లో ఇప్పటికే భూమిపూజ చేసిన స్థలంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వెంటనే నిర్మించాలని బండి సంజయ్ కోరారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. సనాతనధర్మ పరిరక్షణ కోసం అందరూ కలసికట్టుగా ఉండాలని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ధూపదీప నైవేద్యాలకు నోచుకోలేని పురాతన ఆలయాలను గుర్తించి, టీటీడీ నిధులను కేటాయించి వాటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నానని అన్నారు. కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట రామాలయం ఆలయాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఇతర మతస్తులు టీటీడీలో పనిచేస్తున్నందునే ఆచార వ్యవహారాల్లో తేడా వస్తోందని సంజయ్ అన్నారు. స్వామిపై నమ్మకంలేని వ్యక్తులకు జీతాలిచ్చి ఎందుకు పోషిస్తున్నారని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు సరికాదని అన్నారు. బొట్టు పెట్టుకుని వెళితే మసీదులు, చర్చిల్లో ఉద్యోగాలు ఇస్తారా అని ప్రశ్నించారు.

## రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై

# ఫోకస్ పెట్టాం

మొదటి పేజి తరువాయి

మన దేశంలో బీహార్ లో ఫర్టిలిటీ రేటు 3 శాతంగా ఉందని, ఏపీలో 1.7 శాతానికి చేరుకుందని చెప్పారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారని... ఇప్పుడు ఎక్కువ జనాభా ఉన్న దేశాలకు గౌరవం దక్కుతోందని చంద్రబాబు అన్నారు. గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే... స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు లేదనే చట్టాన్ని తాను తీసుకొచ్చానని... ఇప్పుడు జనాభా పెరుగుదలను తానే సమర్థిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై దృష్టి సారించామని తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవ సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## పవర్ షేరింగ్ ఏమీ లేదు: మల్లు భట్టి విక్రమార్క



ఢిల్లీ : బీఆర్ఎస్ నేతల మాటలు మితిమీరిపోయాయని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, అదే సమయంలో జనాల్లోకి కూడా వెళ్లడం లేదని భట్టి విక్రమార్క తెలిపారు. ఈరోజ(శక్రవారం, జూలై 11వ తేదీ) ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్న మల్లు.. తమ ప్రభుత్వంలో అంతా కలిసికట్టగా పనిచేస్తున్నారని, ఇక్కడ పవర్ షేరింగ్ అంటూ ఏమీ లేదని మల్లు తెలిపారు. అందరం కలిసి టీమ్ వర్క్‌గా పనిచేస్తున్నామన్నారు. 'రెండు లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది విధాన నిర్ణయం. రేషన్ కార్డు ఆధారంగానే కుటుంబంలో రుణ మాఫీ. సన్నం బియ్యం సక్సెస్ అయ్యింది. మహిళలకు ఉచిత బస్సుకు మంచి స్పందన ఉంది. ఫోర్త్ సిటీ పనులు జరుగుతున్నాయి. మూసి సుందరీకరణ ఈ ప్రభుత్వం హయంలో పూర్తి అవుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తుంది. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేది లేదు. సిగాచి ప్రమాదం పై విచారణ కు ఆదేశించాము. ఇటీవల జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో ఖర్గే,కేసి వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల పూర్తి సంతృప్తితో ఉంది' అని మల్లు తెలిపారు.

## మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది



అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0' కార్యక్రమం విజయవంతం అయిందని చెబుతూ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. సమాజం స్వచ్ఛందంగా అందించిన మద్దతు విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంచడం, విద్యార్థుల ప్రగతిని సమీక్షించడం, పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 'మెగా పీటీఎం 2.0' ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపునకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించడం జరిగిందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించి, వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని నారా లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా, వారి భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్రను మరింత క్రియాశీలం చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## పదవి బాధ్యతలు స్వీకరించిన సీఐ రాజిరెడ్డి




ఎల్లారెడ్డి, శుభోదయం న్యూస్: ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో మెదక్ సీసీఎస్ నుండి ఎల్లారెడ్డి సీఐగా వచ్చిన డి. రాజిరెడ్డి శుక్రవారం ఎల్లారెడ్డిలో బాధ్యతలు స్వీకరించారు. సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో ప్రజలు సహకరించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎవరైనా యువకులు గంజాయి వ్యసనంతో జీవితం నాశనం చేసుకుంటుంటే అలాంటి వారి సమాచారం అందించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

## బీర్కూర్ గురుకులంలో ప్రపంచ జనాభా దినోత్సవం




బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): బీర్కూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకుల లో మేరా యువ భారత్ సేవా సంఘం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ %ఉ% మానిటరింగ్ కమిటీ మెంబర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ వరల్డ్ పాపులేషన్ డే సందర్భంగా ప్రపంచంలో అత్యధికంగా జనాభా కలిగిన దేశం భారతదేశం అలాగే అత్యధికంగా యువత కలిగిన దేశం కూడా భారతదేశమే జనాభా పెరుగుతుంది దానికి తగ్గట్టుగా భూమి మాత్రం పెరగడం లేదు జనాభా పెరుగుదల వల్ల లాభాలు ఉన్నాయి నష్టాలు కూడా అంతే మోతాదులో ఉన్నాయి వ్యవసాయం చేయడానికి భూమి తక్కువ అవుతుంది టెక్నాలజీ పెరిగి వ్యవసాయంలో గణనీయంగా మందులను ఉపయోగించి అధిక దిగుబడి సాధిస్తున్నాం కానీ పెస్టిసైడ్ ఉపయోగించిన వ్యవసాయ ధాన్యాలను తినడం వల్ల మన జీవితకాలం తగ్గుతుంది మనలో ఉన్న వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది దీనివల్ల ఎంతో నష్టం పర్యావరణం కలుషితం అయిపోతుంది ప్రతి ఒక్కరం మొక్కలను నాటి ప్రకృతిని నాశనం చేయకుండా ఎక్కువ పెస్టిసైడ్ ఉపయోగించకుండా ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడి సాధించాలని అని విద్యార్థులకు సూచించడం జరిగింది అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగింది గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ శివకుమార్ వైస్ ప్రిన్సిపాల్ అరవింద్ ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది.

## ఆర్థిక సహాయం అందజేత



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన కర్రె రామకృష్ణ పెద్ద కుమారుడు కర్రె హరేంద్ర,మరణించారు,వారి యొక్క కుటుంబ సభ్యులకి ఏ జే ఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో 5,000/ వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువత,ఏ జే ఆర్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

-మండల తహసిల్దార్ జి.దశరథ



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మండల తాసిల్దార్ జి దశరథ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని వేములకొండ లోతుకుంట పరిధిలోగల మూసి వాగులు ఆయన తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఇసుక నింపుతున్న ట్రాక్టర్ యజమానుల వద్ద అనుమతి పత్రాలను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. కచ్చితంగా ట్రాక్టర్లకు అనుమతి పత్రాలు ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్ గల డ్రైవర్లు, వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ కలిగి ఉండాలని ఉదయం 10 గంటల నుండి నాలుగున్నర గంటలలోపు ఇసుక రవాణా చేయాలని రాత్రి వేళలో అక్రమఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఐలాపురం నాగేష్, ఆయా గ్రామల రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## చిప్పకుర్తి శ్రీనివాస్ కు గురు వందనము అవార్డు



మంచిర్యాల, జిల్లా ప్రతినిధి - శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): ఈ నెల 12 తేదీన హైదరాబాద్ లో సృజన ఆర్ట్ క్రియేషన్స్, కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా మంచిర్యాల జిల్లాకు చెందిన చిత్రకారుడు, ఆర్ట్ టీచర్, చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ గా, సామాజిక వేత్తగా చేస్తున్న సేవలకు గాను గుర్తించి చిప్పకుర్తి శ్రీనివాస్ కు "గురు వందనం అవార్డు 2025" ఇవ్వనున్నారు. సృజన ఆర్ట్ క్రియేషన్స్, కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ వారు శ్రీనివాస్ కు ఆహ్వానం అందించారు. శ్రీనివాస్ ఈ సందర్భంగా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు... ఈ ఆహ్వానం పట్ల ప్రముఖులు, చిత్రకారులు హర్షం వ్యక్తం చేశారు.

## రుద్రారం ఘటన అత్యంత దురదృష్టకరం..

### అతి త్వరలో విగ్రహాల పున ప్రతిష్టాపన సీసీ కెమెరాలు ఏర్పాటు

### పరమత సహనానికి ప్రతీక



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): పటాన్చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో గల ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఘటన అత్యంత దురదృష్టకరమని.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పురోహితులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో చర్చించి అతి త్వరలో విగ్రహాల పున ప్రతిష్టాపనతో పాటు, సీసీ కెమెరాలు, బలిపీఠం, ఆలయం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామ పుర ప్రముఖులు, పోలీసు అధికారులతో కలిసి ఆలయాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ సందర్శించారు. ఆలయ పరిసరాలను పరిశీలించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం మతిస్థిమితం లేని వ్యక్తి ఈ ఘటనకు పాల్పడినట్లు విచారణలో తెలిసిందని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే గ్రామ పెద్దలతో పాటు. పోలీసులు అధికారులతో చర్చించి ఆవాంఛనీయ ఘటన జరగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సమయమనంతో వ్యవహరించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పరమత సహనానికి పటాన్చెరు నియోజకవర్గం ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, సిఐ వినాయక రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, రుద్రారం పీఏసీఎస్ అధ్యక్షులు పాండు, మాజీ ఎంపీటీసీలు రాజు, హరిప్రసాద్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, గ్రామ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం

### ముక్య అతిథిగా రాష్ట్ర యూత్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి

### బాన్సువాడలో యువతకు ప్రాధాన్యత ఇస్తాం : పోచారం భాస్కర్ రెడ్డి






బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రం శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమీక్షా సమావేశం కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి బీర్కూర్ మండలం నుండి యువనాయకులు మియాపూర్ శశికాంత్ ఆధ్వర్యం లో సుమారు 200 మంది బైక్ ర్యాలీ ద్వారా బాన్సువాడ లో బీర్కూర్ చౌరస్తా కి చేరుకున్నారు. అలాగే నసురుల్లాబాద్, వర్ని, చందూర్, కోటగిరి, పోతంగల్, రుద్రూర్, మోస్రా బాన్సువాడ నుండి సుమారు 2000 బైక్ ర్యాలీ ద్వారా బీర్కూర్ చౌరస్తా నుండి ర్యాలీగా సభాస్థలానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల మాజీ డిసిసిబి ఛైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ లో ఉన్న ప్రతీ కార్యకర్త రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో చురుగ్గా పాల్గొని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియ చేసే విధంగా పని చేసి నూటికి నూరు శాతం సర్పంచ్,జడ్పీటీసీ, ఎంపీటీసీ, గెలిచే విధంగా పనిచేయాలని యూత్ నాయకులు భాస్కర్ రెడ్డి పిలుపును ఇచ్చురూ. అలాగే యువత డ్రగ్స్,గంజాయ వంటి చెడు వ్యసనాలకు అలవాటు అయి ఎంతో మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు అని ఎక్కడైనా ఎవరైనా గంజాయి అమ్ముతున్నట్టు గాని సేవిస్తున్నట్టు కానీ మీకు తెలిస్తే ముందుగా నాకు సమాచారం అందించండి వాటి పట్ల నిర్లక్షం చేస్తే జీవితాలు నాశనం అవుతున్నాయి అని తెలిపారు. అలాగే తెలంగాణా రాష్ట్రం లోనే బాన్సువాడ లో అనేక అభివృధి పనుల్లో ముందుంది అని దానికి కారణం మన నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన క్షణాల్లోనే డ్రక్స్ ను హుక్కుపాదం మోపారు అని అలాగే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు అని ప్రతీ ఇంటికి 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గం లో యువతకు ప్రాధాన్యత ఇస్తాం అని తేలిపోయారు. రాష్ట్రం లో కూడా యువతకు 50 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని భాస్కర్ రెడ్డి తెలిపారు. బాన్సువాడ కు మొట్టమొదట సారి వచ్చిన తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ కు బాన్సువాడ నుండి అందవలసిన సహాయ సహకారాలు తప్పకుండా అందించి తమకు తోడుంటామని భాస్కరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ జెనరల్ సెక్రటరీ మరియు కామారెడ్డి జిల్లా ఇంచార్జి అమృత,మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్. ఈ సమావేశంలో పాల్గొన్న కామారెడ్డి జిల్లాలోని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నియోజకవర్గాల వారిగా బాన్సువాడ అధ్యక్షులు సయ్యద్ మన్సూర్ ,కామారెడ్డి అధ్యక్షులు శ్రీనివాస్, ఎల్లారెడ్డి అధ్యక్షులు శ్రీ సర్దార్ నాయక్ గారు, జుక్కల్ అధ్యక్షులు ఇమ్రోజ్ గారు,కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, పుప్పాల అభిషేక్, అజీమ్, అబు,అజ్మత్ గార్లు మరియు బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు,యువజన నాయకులు.

## తల్లిదండ్రులు, ఉపాధ్యయుల ఆత్మీయ సమావేశంలో భాగంగా.....

### కెజిబివి, విరాట్ నగర్, అంకాలమ్మ వీధి మండల ప్రాథమిక పాఠశాలలో పాల్గొన్న ఆకుపాటి




పామూరు మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): తల్లిదండ్రులు , ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కార్యక్రమం లో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం , విరాట్ నగర్ మండల ప్రాథమిక పాఠశాల, అంకాలమ్మ వీధి మండల ప్రాథమిక పాఠశాలల నందు నిర్వహించిన కార్యక్రమం లో పాల్గొన్న ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ . ఈ కార్యక్రమం లో ఎన్డీఏ కూటమి నాయకులు విద్యార్ధిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యయుని ఉపాధ్యయులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

## మెగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం



దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం దోర్నాల మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తలపెట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం 2.0 ఎంతో విజయవంతంగా జరిగింది ఈ సమావేశానికి 100 పైగా తల్లిదండ్రులు పాల్గొన్నారు తల్లికి వందనం లో భాగంగా పుష్పాలతో పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు పొందారు కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు తల్లిదండ్రులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి నివేదికలను అధ్యాపకులు చదివి వినిపించారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తల్లిదండ్రులు ప్రధాన చార్యులు అధ్యాపక అధ్యాపకేతర ఇబ్బంది పాల్గొని విజయవంతం చేయడం జరిగింది సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ నోట్ బుక్స్ టెక్స్ట్ బుక్స్ రికార్డులు కాంపిటేటివ్ మెమోరియల్ విద్యార్థులకు ఇవ్వడం జరిగింది విద్యార్థులు సైబర్ నేరాలు మాదకద్రవ్యాలు విద్యార్థులకు వివరించారు తోటి విద్యార్థులకు అవగాహన కల్పించారు



## భద్రాచలం సీతారాముల సన్నిధిలో బైరెడ్డి, దారపనేని



పామూరు మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): భద్రాచలంలో సీతా సమేతంగా కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో శుక్రవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి లు సీతారాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాచలం దేవస్థానంలో ప్రతి శుక్రవారం ఆ సీతారాముల కు బంగారు తొడుగు ఆభరణాలను అలంకరిస్తారు. శుక్రవారం సీతారాముల దర్శనం సకల సంపదలకు, ఆయురారోగ్యాలకు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తులకు అపారమైన నమ్మకమని, అఖండ కోటి బ్రహ్మాండ నాయకుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని బైరెడ్డి, దారపనేని పేర్కొన్నారు. యడవల్లి వెంకట్ రెడ్డి, పత్తిపాటి నాగయ్య సీతారాముల వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

## ఉడుముల వెంకట సుబ్బారెడ్డి

## భౌతికకాయానికి నివాళులర్పించిన...

## పామూరు మండల వైయస్ఆర్‌సీపీ నాయకులు



పామూరు మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): దూబగుంట గ్రామానికి చెందిన పార్టీ నాయకులు ఉడుముల వెంకట సుబ్బారెడ్డి (యర్రపురెడ్డి) అనారోగ్యం కారణముగా చనిపోవడం జరిగినది.ఈ విషయం తెలుసుకున్న వైయస్ఆర్‌సీపీ పామూరు మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీ గట్ల విజయభాస్కర్ రెడ్డి, కందుల శివరామిరెడ్డి, కోట వెంకట కృష్ణారెడ్డి, మన్నే హరనాధరెడ్డి,సూరీపోగు మాల్యాద్రి తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించి, ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు..

## విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయండి - గంగసాని



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నేడు (12-07-25) శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పామూరు మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించే వైయస్ఆర్‌సీపీ పామూరు మండల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో గంగసాని హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ రేపటి సమావేశానికి ముఖ్య అతిధిగా కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటారని అన్నారు.. కావున ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు.. ఈ సమావేశంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీ గట్ల విజయభాస్కర్ రెడ్డి, రెక్కల వెంకటేశ్వరరెడ్డి, గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, మితికాల బాలకృష్ణ,గాజులపల్లి రాజశేఖర్ రెడ్డి, రాచకొండ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రుద్రారం గ్రామం హనుమాన్ దేవాలయంలో విగ్రహాలు ధ్వంసం



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): రుద్రారం గ్రామం హనుమాన్ దేవాలయం లో అగంతకుడు చొరబడి విగ్రహాల ధ్వంసంచేసిన విషయం తెలుసుకుని జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మెదక్ ఎంపీ రఘునందన్ రావు గారు. ఎమ్మెల్సీ డా: అంజిరెడ్డి కలిసి అక్కడకి వెళ్ళి పోలీస్ వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది.విగ్రహాలు ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని గతంలో కూడా ఇలాంటి ఘటనలు సంగారెడ్డి పటాన్ చేరు ప్రాంతంలో తరచూ జరుగుతున్నాయని మళ్ళీ ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ఉపేక్షించేది లేదని తెలియజేయడం జరిగింది. సదాశివ పెట్ పట్టణంలో జరిగినప్పుడు మతిస్థిమితం లేని వ్యక్తి అనే సాకుతో వదిలేశారు. పటాన్ చేరు పరిధిలోని జిన్నారం లో కోతుల పేరు చెప్పి వదిలేశారు. కానీ ప్రతి సారి ఏదో ఒక సాకు చెప్పి వదిలేయడం కేవలం హిందూ దేవీదేవతల విగ్రహాలను మాత్రమే ధ్వంసం చేయడం వెనుక కచ్చితమైన కుట్ర కోణం ఉందనే అనుమానం కలుగుతుందని. వెంటనే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తే తప్ప మళ్ళీ పునరావృతం కావని పోలీస్ వారికి కోరడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే, జిల్లా ఉపాధ్యక్షులు పోచారం రాములు, ప్రతాప్ రెడ్డి, సంగమేశ్వర్, బీజేవైఎం నాయకులు ప్రవీణ్, హిందూ సంఘాల నాయకులు సుభాష్, రుద్రారం గ్రామస్థులు పెంటేష్, రాజేష్, విరారెడ్డి,సుధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పూజారి భవానీకి డాక్టరేట్



జిన్నారం, (శుభోదయం న్యూస్): జిన్నారం మండలంలోని గడ్డపోతారం మున్సిపాలిటీలోని అల్లీనగర్ గ్రామానికి చెందిన పూజారి భవానీ మహిళా కళాశాల క్రీడాకారుల విద్యార్థులకు రంగంలో జీవ వైవిధ్య పరమైన లక్షణాలపై సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథానికి ఓయూ పీహె చ్ పట్టా అందజేశారు. పీహెచ్ఏ పరిశోధన లకు అన్ని విధాల అండగా నిలిచిన ప్రొఫెసర్ వెంకట్రెడ్డికి, లక్ష్మీ కాంత్ రాథోడ్,సునీల్ కుమార్, రాజేష్ కుమార్,దీపాల జగన్మోహన్, కుటుంబ సభ్యులు పూజారి కుమార్ గౌడ్, లక్ష్మీ లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల లో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు గతంలో 26 జాతీయస్థాయిజి 27 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో తెలంగాణ నుండి పాల్గొని 15 రాష్ట్రస్థాయి 3 జాతీయస్థాయి పథకాలు సాధించడం జరిగింది. డాక్టరేట్ పట్టా అందుకున్న పూజారి భవానీ. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## మంత్రి సత్య కుమార్ యాదవ్



ఉమ్మడి, అనంతరం జిల్లా బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్) : ప్రజల దగ్గరికి సేవలు తీసుకురావడమే నిజమైన పరిపాలన.యువత, మహిళల ఆరోగ్య సాధికారతే శాశ్వత అభివృద్ధికి బలం.కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో ఆరోగ్యంలో విప్లవాత్మక మార్పులు. - మంత్రి సత్య కుమార్ యాదవ్.ధర్మవరం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గంలోని శివనగర్లో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్) సందర్శించి, ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, రోగులతో నేరుగా సంభాషించి, కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కేంద్ర పనితీరును పరిశీలించి, వారి సేవాపరమైన అంకితభావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి మరియు పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపుదల అవసరమని పేర్కొన్నారు. యువతకు సరైన సమాచారం, ఆరోగ్య సంరక్షణ సదుపాయాల అందుబాటుతో వారి భవిష్యత్తు మెరుగవుతుందని నొక్కిచెప్పారు. ఈ సంవత్సరం జనాభా దినోత్సవం యు న్ ఇతివృత్తం ప్రకారంయు న్యాయమైన మరియు ఆశాజనకమైన ప్రపంచంలో యువత కోరుకునే కుటుంబాలను సృష్టించేందుకు వారికి శక్తి కల్పించడం అనే సందేశాన్ని ప్రతిపాదించినట్లు వివరించారు. జనాభా గణాంకాల కంటే మానవ అస్తిత్వం, శ్రేయస్సు ముఖ్యమనిబీ ప్రతి యువత, మహిళ ఆరోగ్యంగా, అవకాశాలతో సుసంపన్నులై ఉండేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. స్వర్ణ ఆంధ్ర 2047 దిశగా మేము నడుస్తున్నాం, ప్రతి ఆరోగ్య కేంద్రం ప్రజలకు సాధికారత కలిగించే వేదికగా మారాలని, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసి, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, అందుకోసం సిబ్బంది. అంతా నిబద్ధతతో పని చేయాలని పిలుపునిచ్చారు. జనాభా దినోత్సవం %-% ప్రజల శ్రేయస్సుకు అంకితమైన రోజు ఈ దినోత్సవం కేవలం గణాంకాల పరిమితి కాదు, ప్రజల శ్రేయస్సు, వారి హక్కులు, ఎంపికలు, ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాల్సిన ప్రత్యేక రోజు అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చెన్న రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సౌమ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



రేగొండ మండల రిపోర్టర్, మంతెన సురేష్ (శుభోదయం న్యూస్) : 13,తేదీన జరిగే జిల్లా మహా సభ ను విజవంతం చేయాలనీ రేగొండ మండల కార్యదర్శి పెంట రవి పిలుపు నించారు. ఈ నెల 13 వ తేదిన రేగొండ మండల కేద్రం లోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే సిపిఐ భూపాలపల్లి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్బంగా జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పెంట రవి మాట్లాడు తూ పేద ప్రజల ప్రక్షాళన నిరంతరం పోరాటం చేసే కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని అలాంటి కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాసభలను రేగొండ మండల కేంద్రంలో నిర్వహించడం సంతోషదాయకమని భూపాలపల్లి జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పార్టీ జిల్లా మహాసభలో చర్చించబడతయని జిల్లా మహాసభలను ప్రజలు పార్టీ కార్యకర్తలు ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ సినియర్ నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, జిల్లా నాయకులు శాంతి కుమార్,రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి చంద్రమౌళి, అన్నారపు రాజేందర్,చక్రపు ఆగయ్య గుర్రాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తరుణం రెస్టారెంట్ ప్రారంభం



ఒంగోలు, (శుభోదయం న్యూస్): ఈ రోజు ఒంగోలు లాయర్ పేట పోస్ట్ ఆఫీస్ ఎదురు తరుణం రెస్టారెంట్ గ్రాండ్ గా ప్రారంభించడం జరిగింది. ఈ రెస్టారెంట్లో వెజ్- నాన్ వెజ్ ఐటమ్స్ తో పాటు వివిధ రకాలైన టిఫిన్స్, టీ స్నాక్స్ తదితర వెరైటీలు తో ఆహ్లాదకరమైన వాతావరణంలో తరుణం హెూటల్ ప్రారంభించడం జరిగింది. తరుణం రెస్టారెంట్ నిర్వాహకులు జి. తరుణ్ మాట్లాడుతూ శిక్షణ పొందిన చెఫ్ లతో టీలు వివిధ రకాల దోశలు టిఫిన్లతో



పాటు అన్ని రకాల నాన్ వెజ్ ఐటమ్స్ మా తరుణం హెూటల్ నందు లభించును అన్నివేళలా జొమోటో స్విగ్గీ ద్వారా మీ ఇంటి వద్దకే మీరు ఇచ్చిన ఆర్డర్ పంపించగలము వివరాలకు జీ. తరుణ్ సెల్ నెంబర్ 79935 54101 సంప్రదించగలరు. ఈ ప్రారంభ కార్యక్రమంలొ అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డేంపూడి సుజాత రావు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు. సినీ నటుడు దన్నారపు మస్తాన్రావు. ది సేవ్ యానిమల్ ఫౌండేషన్ నిర్వాహకురాలు బొల్లినేని శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్, మోటుపల్లి వెంకటేశ్వర్లు (చౌదరి) తో పాటు తరుణ్ బంధుమిత్రులు పాల్గొన్నారు.

## శిరివరం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



లేపాక్షి, మండల రిపోర్టర్ - అమరేష్ (శుభోదయం న్యూస్ ): హిందూపురం శాసనసభ్యులు పద్మభూషణ్ శ్రీ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు లేపాక్షి మండల పరిధిలోని శిరివరం పంచాయతీలో నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లేపాక్షి మండల అధ్యక్షులు అభిలాష్ పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వం ఒక సంవత్సరంలో చేసినటువంటి అభివృద్ధి కార్యక్రమాలను మరియు భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నాయకుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు బూత్ కన్వీనర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

### రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించిన బల్లికురవ ఎస్సై శివ నాగరాజు



బల్లికురవ, (శుభోదయం న్యూస్): ఫ్యాక్షన్ గ్రామం అయినటువంటి వేమవరం లో రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తున్న మూడవత్ హరికృష్ణ నాయక్ అనే వ్యక్తిని చర్యలులొ భాగంగా బల్లికురవ ఎస్ఐ బల్లికురవ తహిశాల్దార్ ఎదుట హాజరు పరిచి బైండొవర్ చేపించటమైనది. గతంలో వేమవరం గ్రామంలో రాజకీయ హత్యలు జరిగాయి. అప్పటినుంచి వేమవరం గ్రామంలో పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు. ఏ విధమైన చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు వైశ్యమ్యాలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ఎవరు ప్రయత్నించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆరు రోజుల చిన్నారికి రక్తదానం




గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 13(శుభోదయం న్యూస్): లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ గురువారం 6 రోజులచిన్నారికి రక్తదానం చేసింది వివరాల్లోకి వెళితే ఆర్ టి ఆస్పత్రిలో ఆరు రోజుల చిన్నారి అరుదైన బి నెగిటివ్ రక్తం అవసరం కాక లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రంజాన్ ను వారు సంప్రదించారు రక్తదాత సుభాన్ కు ఫోన్ ద్వారా సంప్రదించి గోపి బ్లడ్ బ్యాంక్ వచ్చే రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సుభాన్ కు రంజాన్ కృతజ్ఞతలు తెలిపారు.

## వేగవరం బిసికాలనిలో రేషన్ స్టాక్ పాయింట్ ప్రారంభం

### డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు



జంగారెడ్డిగూడెం -డివిజన్ ఇంచార్జ్ -జూలై 11 (శుభోదయం న్యూస్): జంగారెడ్డిగూడెం మండలం వేగవరం బిసి కాలనిలో పౌరసరఫరాలకు సంభవించి రేషన్ స్టాక్ పాయింట్ ను ఈరోజు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు వేగవరం సర్పంచ్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా శేషు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో ఉన్న పాయింట్ తొలగించడంతో అక్కడ నుంచి వేగవరం వచ్చి రేషన్ పట్టుకెళ్లడనికి దాదాపు 400 మంది కార్డుదారులు ప్రతినెలా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని స్థానిక ఎమ్మెల్యే రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించి జంగారెడ్డిగూడెం మండల తహసీల్దార్ కు అక్కడ వారికి ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేసి వారికి అక్కడే రేషన్ అందించాలని ఉత్తర్వులను ఇవ్వడంతో ఈరోజు పాయింట్ ను శేషు ప్రారంభించారు. అనంతరం స్థానిక నేతలతో కలిసి బిసికాలనిలో సూపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి కుక్కల మాధవరావు, గ్రామ టిడిపి అధ్యక్షుడు ఆలపాటి దుర్గారామ్ ప్రసాద్, జనసేన అధ్యక్షుడు అనిశెట్టి శ్రీనివాస్, రమణ, నడుపుడి శ్రీనివాస్, చిన్నకృష్ణ, బల్లె సత్యనారాయణ, పంబి సత్యనారాయణ రాంబాబు, ఎరుకు నాయుడు, పైడిరాజు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీనివాసపురం గ్రామంలో పొల్యూషన్ అనలిస్ట్ వాటర్ శాంపుల్ సేకరణ



జంగారెడ్డిగూడెం - డివిజన్ ఇన్చార్జ్- జూలై 11 (శుభోదయం న్యూస్): ఈనెల 7వ, తేదీన జంగారెడ్డిగూడెం మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో ఉన్న నవభారత్ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నుండి విలువడే పొగ వలన, గాలి కాలుష్యం, వాటర్ పొల్యూషన్, బాయిలర్ నుండి విలువడే బూడిద ఇవన్నీ బాధిత గ్రామమైన శ్రీనివాసపురం గ్రామా ప్రజలకు ఎఫెక్ట్ అవుతుందని. ఏలూరు జిల్లా అధికారులకు పొల్యూషన్ బోర్డు అధికారి %ఎజ% రావుకీ గ్రామస్తుల కొందరు ఫిర్యాదు చేయడంతో నేడు ఏలూరు కార్యాలయం నుండి పొల్యూషన్ అనలిస్ట్ తేజస్విని తమ సిబ్బందితో వచ్చి వాటర్ శాంపిల్ తీసుకోవడం జరిగింది. అలాగే వాటర్ శాంపిల్ తీసుకెళ్లి తెలంగాణాలో కూడా టెస్ట్ చేపిస్తామని రెండు రిపోర్టులు ఒకటి కాకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ప్రసాద్ ఏపీ. చైర్మన్. కన్స్యూమర్ రైట్స్. ఆంధ్రప్రదేశ్. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో నగరం నడిబొడ్డు నుండి డ్రైనేజీ లోవెళుతున్న ఫ్యాక్టరీ వ్యక్తపదార్థములు స్థానిక బోర్లలో కలుస్తున్న పట్టించుకుని నాధుడి లేరు వర్షం పడితే ఫ్యాక్టరీ నుండి వదిలే దుర్వాసనకు ప్రజలు భరించలేకపోతున్నారు మాగోడు ఎవరికి చెప్పుకోమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు ఈ ప్యాక్టర్టరీ నుండి విలువడి దుర్వాసన కలుషిత నీరు వలన ప్రజలకు శర్మ వ్యాధులు అంటూ వ్యాధులు మరియు దీర్ఘ కాలిక వ్యాధులు వస్తాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు అని ప్రజలు ప్రజా సంఘాల వారు విమర్శిస్తున్నారు దీనిపై స్థానిక ప్రజల ప్రతినిధులు కల్పించుకొని శాశ్వతమైన పరిష్కారం దిశగా ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు.

## మున్సిపల్ కమిషనర్ పలు వార్డులు పర్యటన



బాపట్ల, (శుభోదయం న్యూస్): బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల నందు ఉదయం నుండి మునిసిపల్ కమిషనర్ .జి.రఘునాథరెడ్డి విస్తృతంగా పర్యటించారు. సూర్యలంక రోడ్డు నందు వివేక ఫాస్టర్ స్కూల్ దగ్గర డ్రైనేజీ పూడిక తీత పనులను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. గత కొంతకాలం నుండి పూడిక పనులను చేయనందువల్ల డ్రైనేజీ నందు మట్టి నిల్వలు అధికంగా పేరుకుపోయి ఉండడం ద్వారా పారుదల సరిగా లేనందున దుర్గంధం వెదజల్లుతూ ఆ ప్రాంతవాసులు చాలా ఇబ్బందులు పడ్డారు. కమిషనర్ చొరవతో యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పూడిక పనులు పూర్తిస్థాయిలో పూర్తవడం ద్వారా ఆ ప్రాంతవాసులు కమిషనర్ కి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కర్లపాలెం రోడ్ లోని మార్కెట్ యార్డ్ ఎదురుగా గల పురపాలక సంఘ స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. స్థలం అంతా పిచ్చి మొక్కలతో పూర్తిగా నిండి ఉండడం వలన జె.సి.బి ద్వారా పిచ్చి మొక్కలు మొత్తాన్ని తొలగించడం, సదరు స్థలమును చదును చేయు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. తదుపరి 3 వ వార్డు రాజీవ్ గాంధీ కాలనీ నందు పి -4 ద్వారా కమిషనర్ దత్తత తీసుకున్నటువంటి బంగారు కుటుంబమైన శ్రీమతి.ముదిగండి సంధ్య వారి స్వగృహాన్ని సందర్శించారు. కుటుంబ పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వారి పిల్లలైన ఆదిలక్ష్మి,శివయ్య, దుర్గబాబులతో కాసేపు సరదాగా ముచ్చటించారు. పాఠశాలకు వెళుతున్నారా లేదా అని ఆరాతీశారు . అనంతరం వారు చదువుతున్న ట్యూషన్ దగ్గరకు స్వయంగా వెళ్లారు అక్కడ ఉన్న ట్యూషన్ అధ్యాపకునితో పిల్లల యొక్క చదువు తీరును గురించి స్వయంగా కొంచెం సేపు మాట్లాడి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాను తనను స్వయంగా కలవాలని భరోసా ఇచ్చారు. అనంతరం సూర్యలంక రోడ్ లోని అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. ఆహార నాణ్యత గురించి అక్కడికి వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

## పార్టీ సిద్ధాంతం కోసం పనిచేస్తే తప్పకుండ అవకాశాలు

### టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



ఆదిలాబాద్ జిల్లా (శుభోదయం న్యూస్) ఉట్నూర్: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పని చేస్తున్నవారికి తప్పకుండ పదవులు వస్తాయని.టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లోని రత్న గార్డెన్ లో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి అనిల్ కుమార్ యాదవ్ తో కలిసి సుగుణక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణత మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతం కోసం పనిచేస్తే తప్పకుండ అవకాశాలు వస్తాయని భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం పనిచేస్తోందని కష్టపడి పనిచేస్తే పదవుల్లో అందరికి అవకాశం ఉంటుందని వివరించారు.ఎవరికీ పదవులు వచ్చినా అంతా కలసి పార్టీ కోసం పని చేయాలని సూచించారు. పాత కొత్త తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ ప్రమాదం జరిగిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మంచిర్యాల జిల్లా (శుభోదయం న్యూస్): బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీ 33వ వార్డ్ లో విష్ణు భక్తుల కమల కిషన్ ఇంట్లో ఈరోజు జరిగిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదం ఒక కుటుంబాన్ని ఆర్థిక నష్టానికి గురిచేసింది ఈ ఘటనలో ఇంట్లోని వాషింగ్ మిషన్ పూర్తిగా ఖాళీ పోయి మోటార్ మాత్రమే మిగిలిపోగా దాంతో పాటు ఇంటి లోపల ఉన్న విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం సమయంలో ఇంటి వెనక భాగంలో ఉన్న గదిలో వాషింగ్ మిషన్ నుంచి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రావడంతో తాము గమనించినట్లు తెలిపారు. వెంటనే స్థానిక వార్డు మాజీ కౌన్సిలర్ పోలు ఉమాదేవి- శ్రీనివాస్ లకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ విద్యుత్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. అనంతరం స్థానికులతో కలిసి మంటలను ఆర్పి వేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఆర్ఐ రమేష్, జూనియర్ అసిస్టెంట్ దాసు కు సమాచారం అందించగా వారు వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా పోలు శ్రీనివాస్ మాట్లాడుతూ షార్ట్ సర్టిఫికేట్ కారణంగా సుమారు 50 వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వ ఆదుకోవాలని అన్నారు.



## వర్షాకాలం దృశ్య రోడ్డును తాత్కాలిక మరమ్మత్తులు చేయిస్తున్న మాజీ జడ్పీటీసీ సంతోష్ కుమార్



మంచిర్యాల జిల్లా (శుభోదయం న్యూస్): బెల్లంపల్లి నియోజకవర్గంవేమనపల్లి మండలం :- మండలంలోని మంగెనపల్లి నుండి నాగారం మధ్యలో అటవీ శాఖ అనుమతులు లేక నిలిచి పోయిన రోడ్డు వర్షాల వల్ల చెడిపోయి గుంతలు ఏర్పడగా అట్టి గుంతలలో మెటల్ కంకర పోసి రోడ్డును తాత్కాలిక మరమ్మతులు చేయించిన మండల మాజీ జడ్పీటీసీ ఆర్, సంతోష్ కుమార్ గారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ ఇ సందర్బంగా మాజీ జడ్పీటీసీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఇట్టి రోడ్డును శాశ్వతంగా రోడ్డు వేయడానికి ఆటవి శాఖ అనుమతుల కొరకు ఉన్నత అధికారులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఇప్పటికే అనేక సార్లు విన్నపించడం జరిగిందని అటవీ శాఖ అనుమతులు రాగానే ఇట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు ఇట్టి రోడ్డుమరమ్మత్తులలో మాజీ జడ్పీటీసీ గారి వెంట యూత్ కాంగ్రేస్ మండల అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ ఒడిలా రాజన్న, మాజీ సర్పంచ్ లు గాలి మధు, తోకల రాంచందర్, నీకాడి భగవంత్, ఇగురం జగన్, మాజీ ఎంపీటీసీ అదే శంకర్, నాయకులు తోడే సుధాకర్ రెడ్డి, గట్టు, శ్రీశైలం, మధుసూదన్, తిరుపతి రెడ్డి, పురుషోత్తం, మంత్రి రమేష్, కాయిత తిటుపతి, దొబ్బల సంతోష్,గణపురం సంతోష్, ఆవులమారి పున్నం, వినోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## సిపిఎంలో చేరిన వారితో జనసేనకు ఎటువంటి సంబంధం లేదు

### జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము



జీలుగుమిల్లి, (శుభోదయం న్యూస్): జనసేన పార్టీకి సిపిఎం పార్టీలో చేరిన వ్యక్తులతో ఎలాంటి సంబంధం లేదని, వాళ్లకు జనసేనలో కనీసం సభ్యత్వాలు కూడా లేవని జనసేన పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి రాము స్పష్టం చేశారు. కొన్ని పత్రికలు, ఛానళ్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా "జనసేన కార్యకర్తలు సిపిఎం పార్టీలో చేరారు" అనే వదంతులు ప్రచారంలోకి వచ్చాయని, అవి పూర్తిగా నిరాధారమని ఆయన ఖండించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం వారు సిపిఎంలో చేరిన వారేనని, వారిని జనసేన పార్టీకి సంబంధించినవారిగా చిత్రీకరించడం తగదని ఆయన పేర్కొన్నారు. "కొంతమంది కావాలని జనసేన పార్టీకి చెడ్డ పేరు పేరు తీసుకురావాలని చూస్తున్నారని అన్నారు. జనసేన పార్టీ మండలంలో బలంగా ఉందని, త్వరలో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రతి గ్రామం నుండి పార్టీకి భారీగా చేరికలు ఉంటాయని" ఆయన అన్నారు. "పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నాయకత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల మధ్య ఆయన 14వ స్థానంలో నిలిచారని మండలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. అపోహలకు తావు లేకుండా ప్రతి కార్యకర్త ధైర్యంగా ముందుకు సాగాలి" అని పసుపులేటి రాము స్పష్టం చేశారు.

శుభోదయం
WWW.SUBHODAYAMDAILY.COM
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ

శనివారం - 12 - జూలై - 2025

## బోగోలు మండలంలో నేడు విద్యుత్ బంద్



(శుభోదయం న్యూస్) బిట్రగుంట: ప్రతినెల రెండవ శనివారం నిర్వహించే విద్యుత్ మరమ్మతులకారణంగాఉదయం 8.30నిమిషాలనుండి మధ్యాహ్నం రెండుగంటల వరకు బోగోలుమండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు విద్యుత్ శాఖఏ.ఈజడరాయతెలిపాడు. మండలం లోని చెంచ ౹లక్ష్మీపురం, జక్కపల్లిగూడూరు, ముంగమూరు, వడ్డీపాలెం సబ్ స్టేషన్లపరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకుఅంతరాయంకలగడం జరిగిందని, అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## శీనన్నకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆవుల రవణమ్మ



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా మండలం లోని నుచుపోద గ్రామ పంచాయతీ పరిధిలోని తిరగల దిన్నె గ్రామంలో ఆవుల రవణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా పుట్టిన రోజు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరగల దిన్నె గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## గురు పౌర్ణమి సందర్భంగా గురువులకు సన్మానం



దోర్నాల మండల రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల, భగవాన్ శ్రీ సత్య సాయి బాబా సేవ మందిరం నందు తేదీ 10-07-2025 గురువారం రోజున గురు పూర్ణిమ మహోత్సవం సందర్భంగా



సాయంత్రం 7.00 గంటలకు ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్తమ గురువులను సన్మానించారు. విశ్రాంత ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండవీటి శ్రీనివాసాచార్యులు గారిని, మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వడ్లమాని నాగమూర్తి గారిని పూలమాలతో శాలువాతో ఘనంగా సన్మానించారు. పట్టు వస్త్రాలు మరియు జ్ఞాపికలు అందించారు.

## పంట డిజిటల్ క్రాప్ సర్వేపై శిక్షణ మరియు అవగాహన కార్యక్రమం




దోర్నాల, మండలం రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్): 11.07.2025 న దోర్నాల మండలం లోని మండల తహసీల్దార్ కార్యాలయం నందు గ్రామ రెవిన్యూ అధికారులకు మరియు రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఖరీఫ్ 2025 ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే పై శిక్షణ మరియు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల తహసీల్దార్ సిహెచ్. అశోక్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ పంట నమోదు ప్రతి



ల్యాండ్ పార్సెల్ చేయాలనీ వీఆర్వో లు ఆర్ ఎస్.కె సిబ్బంది కలిసి మన మండలం లో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలనీ చెప్పడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ మాట్లాడుతూ ఈ పంట నమోదు విధి విధానాలు, ఖరీఫ్ 2025 సెప్టెంబర్ 15 నాటికీ పూర్తి చేయాలనీ, జియోఫెన్సింగ్ 20మీటర్స్ వరకు మాత్రమే నమోదు చేయడానికి అవకాశం కల్పించడం జరిగిందని, అలాగే, రైతు ఈ కేవైసీ తప్పనిసరి కాదని కేవలం ల్యాండ్ పార్సెల్ అన్ని జియో ఫెన్సింగ్ ద్వారా నమోదు చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమం లో డిటి గారు, వీఆర్వో లు, ఆర్ ఎస్ కె సిబ్బంది పాల్గొన్నారు.

## ఉర్దూస్కూల్ లో తల్లితండ్రులు - ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న హాజిగౌస్




పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు పట్టణం లోని ఇరువురు రోడ్డు నందుగల ఉర్దూ పాఠశాల నందు తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు షేక్ హాజీ గౌస్ ఉర్దూ స్కూల్లో పిల్లలకు పుస్తకాలు మరియు జామెంట్రీ బాక్సులు మరియు పెన్నులు పంపిణీ చేసి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు ఈ కార్యక్రమం లో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

## యారవ శీనన్న జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన అంచురి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు పట్టణంలో స్థానిక శ్రీనివాస్ నగర్ లోని చిల్డ్రన్స్ హోమ్ నందు ఉదయము ఎనిమిది గంటలకు అల్పాహారము రాత్రి 8:00 గంటలకు కనిగిరి వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ యారవ శ్రీనివాస్ గారి జన్మదిన వేడుకలు అంచూరి వెంకట రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా



చిల్డ్రన్స్ హోమ్ లో పిల్లల మధ్య కేక్ కట్ చేసి, పిల్లలందరికి విందు ఏర్పాటు చేయడం జరిగింది.పిల్లలు మరియు చిల్డ్రన్స్ హోమ్ ప్రతినిధులు యారవ శ్రీనివాస్ గారికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాము ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మాలపాటి వెంకటేశ్వర్లు రెడ్డి, పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, పాలపర్తి రమణయ్య, చిన్న హజరత్, నేలపాటి మాల్యాద్రి, గుత్తి మహేష్, ఫత్తు మస్తాన్, అస్లిం, ఓగూరి నరసింహారావు, ఓగురు ఏడుకొండలు, ఎద్దుల శివ, మరియు యారవ అభిమానులు పాల్గొన్నారు.

## పిడుగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ యారవ శ్రీనివాసులు జన్మదిన వేడుకలు



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు జన్మదిన వేడుకలు వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా స్థానిక మమ్మీ డాడీ సెంటర్లో టపాకాయలు పేలుస్తూ నినాదాలు చేస్తూ కేక్ కటింగ్ చేసిన కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు పలువురు ప్రముఖులు యారవ కు శుభాకాంక్షలు తెలియజేసి ఆయన ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డివి మనోహర్, కావిటి సుబ్బయ్య, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ దర్శి రాము, మాజీ పట్టణ అధ్యక్షులు ఖజా రంతుల్లా, అంచురి వెంకటరెడ్డి, వరికుటి చిరంజీవి, గుత్తి రాజా, ఫత్తు మస్తాన్, ఆర్ఆర్ రఫీ, అస్లీమ్, పందిటి హరీష్, డోలా శేషాద్రి, గుత్తి మహేష్, కొండిశెట్టి రమణయ్య, కావేరి రసూల్, దర్శి రమేష్, జనసేన, టిడిపి, బిజెపి, నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్ సుబ్బమ్మ మృతికి సంతాపం తెలిపిన సిఐటియు రైతు సంఘం నాయకులు




దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన వై సుబ్బమ్మ అంగన్వాడి టీచర్ ఈరోజు తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఆమె మృతికి సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ సంతాపం తెలియజేశారు సుబ్బమ్మ మరణం దోర్నాల అంగన్వాడి ఉద్యమానికి తీరని లోటు అన్నారు. దోర్నాల ప్రాజెక్టు అధ్యక్షులుగా పనిచేస్తూ అంగన్వాడి సమస్యల పట్ల 43 రోజుల సమ్మె సందర్భంగా సుబ్బమ్మ గారు ప్రధాన పాత్ర పోషించి అంగన్వాడిలను ఐక్యం చేసి సమ్మె లో వారిని నిలబెట్టడంలో కీలకపాత్ర పోషించిందని అన్నారు. అంగన్వాడీలు చాలీచాలని వేతనాలు, పని ఒత్తిడితో మానసిక ఆందోళనలకు గురై రోగాల బారిన పడుతున్నారని, పని ఒత్తిడి వలన గుండెపోటు అనేక రకాల వింత రోగాలతో మరణిస్తున్నారని ఆయన అన్నారు.ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సంతాపం తెలియజేసిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, రైతు సంఘం జిల్లా నాయకులు డి సోమయ్య,%%. తిరుపతిరెడ్డి అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎస్కే ముంతాజ్, వెంకటరత్నం, వెంకటలక్ష్మి,,శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య కోసం ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కృషి చేయాలి

### జనసేన గ్రామ ప్రెసిడెంట్ పూనెం ఆదిత్య



టి. నర్సాపురం, (శుభోదయం న్యూస్): టీ. నర్సాపురం మండలం మర్రిగూడెం ఆశ్రమ పాఠశాలలో మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన గ్రామ ప్రెసిడెంట్ పూనం ఆదిత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నాణ్యమైన విద్య కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ఉన్నత చదువులు చదివి



అనుకున్న దానిని సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి గురువులను బ్రహ్మగా, విష్ణువుగా, ఈశ్వరుడిగా గుర్తించాలన్నారు. విద్యార్థుల తలరాతను మార్చేది ఉపాధ్యాయులేనని అన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్ ను, ఏకరూప దుస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగింది. ప్రధాన ఉపాధ్యాయురాలు వజ్రి మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్రతో పాటు తల్లిదండ్రుల కృషి కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, నారం బుజ్జి, ధారబోయిన నాగేశ్వరరావు, పొట్ట రవి, సున్నం సురేంద్ర, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## త్రివేణి పాఠశాలలో ఘనంగా ఇన్‌వెస్టిట్యూర్ వేడుక

### విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి: కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి




తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివ కుమార్, (శుభోదయం న్యూస్ ),జూలై 11: త్రివేణి పాఠశాలలో అల్వాల్ లో జరిగిన ఇన్‌వెస్టిట్యూర్ వేడుకలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి గారు పాల్గొని, ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జ్‌లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాలలోని రోజువారీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అదే సమయంలో, మొక్కల సంరక్షణ మరియు సామాజిక కార్యక్రమాలలో కూడా సమయం కేటాయించి పాల్గొనడం ద్వారా సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌వో సుబ్బారావు మాట్లాడుతూ, త్రివేణి విద్యార్థులు ప్రతి సంవత్సరం 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్' నినాదంతో పాటు క్యాన్సర్ నిర్మూలన వంటి సామాజిక కార్యక్రమాలకు తమ వంతుగా విరాళాలు సేకరించి సమాజ సేవలో ముందుంటారని అభినందించారు. ఈ కార్యక్రమంలో సి అర్ ఓ వెంకట్రావు,పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ సుధా జాట్ టీమ్ హెడ్ అర్చన ఠాకూర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలకు నిధులు కేటాయించడం అభినందనీయం

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగినేని సరిత



తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్), జూలై 11: జేబీఎస్ నుండి శామీర్పేట్, ప్యారడైజ్ నుండి సుచిత్ర వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రూ.303 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుండి ఎలివేటెడ్ కారిడార్కు ఖర్చు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషితోనే సాధ్యమైందని కంటోన్మెంట్ మహిళా సీనియర్ నాయకురాలు నాగినేనీ సరిత అన్నారు. ఏడో వార్డు పరిధిలోని లాల్బజార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే శ్రీ గణేష్ చిత్రపటాలకు కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి ఆమె పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ...ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంకు రూ. 303 కోట్లను ఖర్చు పెట్టేందుకు ప్రత్యేక జీవోను విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే శ్రీ గణేష్ కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రంగా రవీందర్ గుప్తా, అరవింద్, డానియల్,మహేష్,అశోక్,సుధాకర్,సందీప్, చిన్నా,రాకేష్,చంటి తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### తాజ్ కృష్ణ హోటల్‌లో అమెరికా స్వాతంత్ర్య వేడుకలు

### కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి

### భారత్-అమెరికా మధ్య సంబంధాలు క్రమంగా పెరుగుతున్నాయన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్: హైదరాబాద్‌లో జరిగిన అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాజ్ కృష్ణ హోటల్‌లో 249వ అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశం, అమెరికా మధ్య దౌత్య సంబంధాలు 1947లో ప్రారంభమై నేటి వరకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, విద్య, సాంకేతిక రంగాల్లో మరింత దృఢంగా మారాయని అన్నారు. ఈ వేడుకలో భారత్-అమెరికా స్నేహ సంబంధాలను గుర్తు చేస్తూ, రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## కర్ణాటక తరహాలో తెలంగాణలో పవర్ షేరింగ్ ఉందా?

### భట్టి విక్రమార్క ఏం చెప్పారంటే...

### కర్ణాటక తరహాలో పవర్ షేరింగ్ లేదన్న మల్లు భట్టి విక్రమార్క

### బీఆర్ఎస్ నాయకుల మాటలు మితిమీరుతున్నాయని విమర్శ

### కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని మండిపాటు

హైదరాబాద్: కర్ణాటక తరహాలో తెలంగాణలో పవర్ షేరింగ్ లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వంలో అందరం టీమ్ వర్క్‌తో పని చేస్తున్నామని ఆయన అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ ప్రభుత్వ పనితీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు మితిమీరుతున్నాయని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, ప్రజల్లోకి వెళ్లడం లేదని విమర్శించారు. రూ. 2 లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది తమ ప్రభుత్వం నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. రేషన్ కార్డు ఆధారంగానే రుణమాఫీ చేసినట్లు చెప్పారు. సన్న బియ్యం విజయవంతమైందని, గతంలో వలె పక్కదారి పట్టడం లేదని ఆయన అన్నారు. ఉచిత బస్సులకు మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మూసీ సుందరీకరణ పనులు ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతాయని హామీ ఇచ్చారు. గాంధీ ఘాట్ వరకు సుందరీకరణ పనులు జరిగితీరుతాయని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తోందని తెలిపారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చే అవకాశమే లేదని ఆయన వ్యాఖ్యానించారు.

## గోదావరికి భారీగా వరద నీరు...

### కంట్రోల్ రూం నెంబర్లు ఇవే!

### ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు

### గోదావరికి పెరుగుతున్న వరద ప్రవాహం

### అలర్ట్ జారీ చేసిన ఏపీఎస్‌డీఎంఏ

గోదావరి: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ఎండి ప్రఖర్ జైన్ శుక్రవారం వెల్లడించారు. నదిలో నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37.2 అడుగులకు చేరుకుందని ప్రఖర్ జైన్ తెలిపారు. అదేవిధంగా, ధవళేశ్వరం వద్ద ప్రస్తుతానికి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2.9 లక్షల క్యూసెక్కులుగా నమోదైందని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో, దిగువ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరించింది. వరద పరిస్థితుల దృష్ట్యా, ప్రజలు అత్యవసర సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 112, 1070, 1800 425 0101 ను సంప్రదించాలని అధికారులు సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, కొన్ని కీలక సూచనలను ఏపీఎస్‌డీఎంఏ జారీ చేసింది. బోట్లు, మోటార్ బోట్లు, స్టీమర్లతో నదిలో ప్రయాణించవద్దని స్పష్టం చేసింది. అలాగే, వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్లడం వంటివి పూర్తిగా నివారించాలని హెచ్చరించింది. స్థానిక అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని, ప్రజలు వారి సూచనలను తప్పక పాటించాలని ప్రఖర్ జైన్ కోరారు.

## వందలాది మంది దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లకు ట్రంప్ ప్రభుత్వం షాక్!

### తొలగించేందుకు అమెరికా సిద్ధం

### లేఆఫ్ నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడి

ఢిల్లీ: డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వందల సంఖ్యలో ఉన్నతాధికారులను తొలగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ తొలగింపు జాబితాలో 1,107 మంది సివిల్ సర్వెంట్లు, స్థానికంగా పనిచేస్తున్న 246 మంది దౌత్యవేత్తలు ఉన్నారని సమాచారం. సంబంధిత వర్గాల సమాచారం మేరకు, వీరికి లేఆఫ్ నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. నోటీసులు అందుకున్న దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లు 120 రోజుల పాటు సెలవుల్లో ఉంటారని, ఆ తర్వాత వారిని అధికారికంగా ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు తెలుస్తోంది. అయితే, వీరిలో ఎక్కువ మందికి 60 రోజుల సమయం మాత్రమే ఇచ్చినట్లు సమాచారం. శాఖల పునర్వ్యవస్థీకరణలో భాగంగా దౌత్య ప్రాధాన్యతలపై దృష్టి సారించామని తాజా నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో పాటు వారి మిత్రపక్షాలు ఈ నిర్ణయాన్ని సమర్థిస్తున్నాయి. అయితే, ప్రస్తుత మరియు మాజీ దౌత్యవేత్తలు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ చర్యల వలన విదేశాల్లో ఇప్పటికే ఉన్న ముప్పుతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం బలహీనపడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల కోతలను నిలిపివేయాలని కోరుతూ అమెరికన్ ఫారెన్ సర్వీసెస్ అసోసియేషన్ గత నెలలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విదేశీ సేవలు అందించే ఈ విభాగానికి అంతరాయం కలిగించడం జాతీయ ప్రయోజనాలను ప్రమాదంలో పడేస్తుందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికన్లపై దీని ప్రభావం పడుతుందని సంస్థ అధ్యక్షుడు టామ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## అక్కడ కేజీ చక్కెర రూ.7వేలు.. లీటర్ పెట్రోల్ రూ.2 వేలు!

ఇజ్రాయెల్: ఇజ్రాయెల్ చేస్తున్న భీకర యుద్ధంతో ఆర్థికంగా కుదేలైన గాజాలో పరిస్థితులు దారుణంగా మారినట్లు తెలుస్తోంది. ఆహారం, ఇంధనం, ఔషధాల కొరత ఎదుర్కొంటున్న పాలస్తీనియన్లకు కరెన్సీ కష్టాలు తీవ్రమయ్యాయి. యుద్ధం నేపథ్యంలో అక్కడి బ్యాంకులు, ఏటీఎంలు పనిచేయకుండా పోవడంతో తాజా పరిస్థితి తలెత్తింది. రోజువారీ ఖర్చులకు అవసరమైన నగదు కోసం మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో ఐదు శాతం కమీషన్ తీసుకున్న దళారులు ఇప్పుడు 40 శాతానికి పెంచేశారని, దీంతో నిత్యవసరాలు కొనేందుకు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పాలస్తీనా వాసులు వాపోతున్నారు. సాధారణంగా గాజా వాసులు చాలా లావాదేవీలకు ఇజ్రాయెల్ కరెన్సీ షెకెల్‌ను ఉపయోగిస్తారు. అయితే, యుద్ధం నేపథ్యంలో పాలస్తీనియన్లకు నగదు సరఫరాను టెల్ అవీవ్ నిలిపి వేసింది. ఇలా ఓవైపు కొత్త కరెన్సీ నిలిచిపోగా.. చిరిగిపోయిన, పాడైన నోట్లను వ్యాపారులు అనుమతించకపోవడం స్థానికులకు మరింత ఇబ్బందిగా మారింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, భారీ నిరుద్యోగిత, పొదుపు చేసుకున్న డబ్బు కూడా ఖర్చు కావడం వంటివి ఆయా కుటుంబాలపై మరింత భారాన్ని మోపుతున్నాయి. హమాస్ ఆయుధాల కొనుగోలు సామర్థ్యాన్ని తగ్గించడంలో భాగంగా ఇజ్రాయెల్ గాజాలోకి నగదును నిలిపివేసినట్లు సమాచారం.



ఇదే సమయంలో స్థానికంగా ఉండే సంపన్న కుటుంబాలు బ్యాంకుల నుంచి డబ్బులు ఉపసంహరించుకొని దేశం విడిచి వెళ్లిపోయారనే వాదన ఉంది. విదేశీ వ్యాపారులు కూడా వస్తువుల విక్రయాలకు నగదునే డిమాండ్ చేస్తుండటం కొరతకు కారణాలని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుంటున్న బ్రోకర్లు షెకెల్స్‌ను డాలర్‌లోకి మార్చేందుకు భారీగా కమీషన్ తీసుకుంటున్నారు. ప్రారంభంలో ఐదు శాతం తీసుకోగా.. ఇప్పుడు 40 శాతానికి పెంచేశారని స్థానికులు వాపోతున్నారు. నిత్యావసరాలు కొనేందుకు భారీగా చెల్లించాల్సి వస్తోందన్నారు.

కేజీ చక్కెర రూ. 7వేలు..

"రవాణాతోపాటు కూరగాయలు, ఆహారం, నీరు, ఔషధాలు.. ఇలా ఏది కొనాలన్నా నగదు అవసరం. దీని కోసం అన్నీ అమ్ముకోవాల్సి వస్తోంది. పిండి, ఆహారపదార్థాలు కొనేందుకు నా బంగారాన్నే అమ్మేశా" అని షాహిద్ అజ్జూర్ అనే మెడికల్ షాప్ యజమాని వాపోయారు. యుద్ధంతో తన వ్యాపారమంతా నాశనమైందన్న ఆయన.. ప్రస్తుతం కుటుంబ పోషణకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. గతంలో రెండు రోజులకు నాలుగు డాలర్లు ఖర్చు అయితే, ఇప్పుడది 12 డాలర్లకు పెరిగిందన్నారు. చక్కెర ధర భారీగా పెరిగిపోయిందని, యుద్ధానికి ముందు కిలో ధర 2 డాలర్లుగా ఉండగా ఇప్పుడది 80-100 డాలర్లు పలుకుతోందని మరో స్థానికుడు పేర్కొన్నాడు. లీటరు పెట్రోల్ 25 డాలర్లుగా ఉందని చెప్పాడు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం.. 2024 చివరలో గాజాలో 80 శాతం మంది నిరుద్యోగులే ఉండగా.. ఇప్పుడది మరింత ఎక్కువైంది. గతేడాది అక్కడ ద్రవ్యోల్బణం 230 శాతం పెరిగింది. అయితే, ఈ ఏడాది జనవరిలో కాల్పుల విరమణతో అది స్వల్పంగా తగ్గినప్పటికీ.. ఒప్పందం నుంచి ఇజ్రాయెల్ వైదొలగడంతో మళ్లీ భారీగా పెరిగింది. మరోవైపు నగదు సంక్షోభం నుంచి బయటపడేందుకు చర్యలు చేపట్టిన పాలస్తీనా వాణిజ్య విభాగం.. గతేడాది డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. అయితే, అది కొంత మందికే చేరువైనట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

శుభోదయం
ప్రతి అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM
శనివారం - 12 - జూలై - 2025

# సినిమా చిత్రం

## గ్లింప్స్ అదుర్స్.. శేష్ 'డెకాయిట్' రిలీజ్ ఎప్పుడంటే?




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ యాక్షన్ డ్రామా డెకాయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఒక ప్రేమ కథ అనే ట్యాగ్ లైన్ తో రూపొందుతున్న ఆ సినిమాకు షానిల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తుండగా.. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. డెకాయిట్ కు అడివి శేష్ కథ, స్క్రీన్ ప్లే అందించగా, అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఎస్ ఎస్ క్రియేషన్స్, సునీల్ నారంగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో మంచి అంచనాలు నెలకొన్నాయి. కొద్ది రోజుల క్రితం రిలీజ్ అయిన టీజర్, లుక్స్ మూవీపై భారీ హోప్స్ ను క్రియేట్ చేశాయని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అయితే టీజర్ తర్వాత ఎలాంటి అప్డేట్ ఇవ్వని మేకర్స్.. రీసెంట్ గా గ్లింప్ ను రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. చెప్పినట్లు.. ఆదివారం ఉదయం రిలీజ్ చేశారు. సినిమా విడుదల తేదీని కూడా ప్రకటించారు. క్రిస్మస్ పండుగ కానుకగా డిసెంబర్ 25వ తేదీన సినిమాను రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. శేష్, మృణాల్ పోస్టర్ ను కూడా రివీల్ చేశారు. మృణాల్ ఎంట్రీతో గ్లింప్స్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత ఏ జూలియట్.. ఏం జరిగింది.. మామూలు విషయం కాదు.. నేను మోసం చేయడానికి రాలేదు.. అంటూ అడివి శేష్ వచ్చారు. అలా కంటిన్యూషన్ గా.. యాక్షన్ సీన్స్ ను యాడ్ చేశారు మేకర్స్. అవి గూస్ బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. గ్లింప్స్ కు స్పెషల్ గా అట్రాక్షన్ గా నిలిచాయి. అయితే గ్లింప్స్ లో శేష్ తన యాక్టింగ్ తో అదరగొట్టారు. యాక్షన్ సీక్వెన్స్ లో తన మార్క్ చూపించారు. మృణాల్ సీరియస్ లుక్ లో ఉన్నారు. మొత్తానికి గ్లింప్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. దీంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయని నెటిజన్లు చెబుతున్నారు. కాగా, ఇప్పటికే డెకాయిట్ మూవీ రిలీజ్ కు ముందే రికార్డులు క్రియేట్ చేస్తోందని టాక్. సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్టు వార్తలు వస్తున్నాయి. రూ.8 కోట్లకు ప్రముఖ సంస్థ సోనీ ఆడియో రైట్స్ ను సొంతం చేసుకుందని తెలుస్తుంది. శేష్ కెరీర్ లో అతి పెద్ద డీల్ అని సమాచారం. మరి మూవీ రిలీజ్ అయ్యాక ఎలాంటి హిట్ అవుతుందో అంతా వేచి చూడాలి.

## కోలీవుడ్ లో 1000 కోట్లు అలా సాధ్యమే?



కోలీవుడ్ ఇండస్ట్రీకి ఇంతవరకూ 1000 కోట్ల వసూళ్ల చిత్రం ఒక్కటీ లేదు. సూపర్ స్టార్ రజనీకాంత్, దళపతి విజయ్, తల అజిత్, చియాన్ విక్రమ్, సూర్య, కార్తీ లాంటి స్టార్లు ఉన్నా? గొప్ప క్రియేటివ్ డైరెక్టర్లు ఉన్నా? 1000 కోట్ల క్లబ్ లో చేరింది లేదు. చివరికి కన్నడ పరిశ్రమ కూడా ఆ క్లబ్ లో చేరింది. ఇక టాలీవుడ్ పాన్ ఇండియా సంచలనాల గురించైతే చెప్పాల్సిన పనిలేదు. 1000 కోట్లు అన్నది తెలుగు పరిశ్రమకి జుజూబీ లాంటింది. దీంతో కోలీవుడ్ రేసులో ఎంతగా వెనుకబడి ఉందన్నది అర్దమవుతుంది. అలా కొంత కాలంగా కోలీవుడ్ కి 1000 కోట్లు అన్నది అందని ద్రాక్షగా మారింది. ఇంత కాలం అందని ద్రాక్ష ఇప్పుడు అందే అవకాశం ఉందా? అంటే అలా అనుకుని సంతృప్తి పడాల్సిందో అరవ పరిశ్రమ. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానా యకుడిగా తమిళ్ మేకర్ అట్లీ ఓ భారీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తుంది. సన్ నిర్మాణంలో ఇదే తొలి భారీ బడ్జెట్ గా రూపొందు తుంది. ఈ సినిమా మాత్రం 2000 కోట్ల వసూళ్ల టార్గెట్ గా బరిలోకి దిగుతుంది. ఇప్పటికే ఈ ఫీట్ ను బన్నీ పుష్ప సాధించి టాలీవుడ్ ని శిఖర స్థానానికి తీసుకెళ్లాడు. అట్లీ కూడా జవాన్ తో 1400 కోట్ల వసూళ్ల చిత్రం చేసాడు. కాకపోతే అది హిందీ లో కాబట్టి కోలీవుడ్ కి ఆ క్రెడిట్ దక్కదు. అలా కోలీవుడ్ అట్లీ ట్యాలెంట్ ను సరిగ్గా వాడుకోలేకపోయింది. బన్నీ చిత్రం హిట్ అయితే మాత్రం ఆ క్రెడిట్ సగమైనా దక్కుతుంది. హీరో తెలుగు వాడైనా? దాన్ని నిర్మిస్తుంది...దర్శకత్వం వహిస్తోంది అంతా కోలీవుడ్ కి చెందిన వారే కాబట్టి సక్సెస్ అయితే క్రెడిట్ లో షేర్ ఇవ్వొచ్చు. అదే చిత్రాన్ని అట్లీ కోలీవుడ్ హీరోతో తీసి 1000 కోట్ల చిత్రాన్ని చేయగల్గితే 100 శాతం క్రెడిట్ దక్కేది. కానీ ఆ ఛాన్స్ లేదు.

## రాజాసాబ్... ప్రభాస్‌కే ఎందుకు ఇలా జరుగుతుంది?



'బాహుబలి', 'సాహో', 'రాధేశ్యామ్' సినిమాల కోసం చాలా ఏళ్లు సమయం కేటాయించిన ప్రభాస్ తదుపరి సినిమాలను చాలా స్పీడ్‌గా చేయాలని అనుకున్నాడు. అందుకోసం బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు కమిట్ అయ్యాడు. ఏడాదికి రెండు, వీలుంటే మూడు సినిమాలను విడుదల చేయాలని ఆశ పడ్డాడు. అభిమా నులతో చాలా సార్లు ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తాను అంటూ హామీ ఇచ్చిన విషయం తెల్సిందే. కానీ దర్శకులు అందుకు సహకరించాలని అన్నాడు. అన్నట్లుగానే ఆయనకు దర్శకుల నుంచి సహకారం అందడం లేదు. రాజాసాబ్ సినిమా గత ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉన్నా ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఆ మధ్య 'రాజాసాబ్' సినిమాను ఏప్రిల్‌లో కచ్చితంగా విడుదల చేస్తామని మేకర్స్ బలంగా చెబుతూ వచ్చారు. కానీ సినిమా షూటింగ్‌తో పాటు, వీఎఫ్‌ఎక్స్ వర్క్ కూడా పూర్తి కాలేదు. దాంతో విడుదల వాయిదా వేయాల్సి వచ్చింది. ఏప్రిల్‌లో మిస్ అయినా సమ్మర్ చివరి వరకు సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని అంతా ఆశించారు. కానీ ఈ ఏడాది చివరికి సినిమాను వాయిదా వేశారనే వార్తలు వస్తున్నాయి. సినీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం 2025 డిసెంబర్‌కి సినిమాను విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సినిమాకు ఆర్థిక ఇబ్బందులు అంటూ పుకార్లు షికార్లు చేశాయి. కానీ సినిమా యొక్క వీఎఫ్‌ఎక్స్ వర్క్ పూర్తి కానందున సినిమా వాయిదా పడ్డట్లు తెలుస్తోంది. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడానికి చాలా సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ లోపు ప్రభాస్ నటిస్తున్న మరో సినిమా ఫౌజీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

సీతారామం దర్శకుడు హను రాఘవ పూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమాను స్పీడ్‌గా షూటింగ్ చేస్తున్నారు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే సినిమా ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాజాసాబ్ సినిమా మాత్రం 2025 డిసెంబర్‌లో కూడా వచ్చే వరకు అనుమానమే అంటూ కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సినిమాకు ఉన్న బజ్‌ను కాపాడుకుంటూ అనుకున్న సమయంకు విడుదల చేసి ఉంటే కచ్చితంగా రాజాసాబ్ సినిమా ఫలితం మరో రేంజ్‌లో ఉండేది అనేది ఇండస్ట్రీ వర్గాల టాక్. పాపం ప్రభాస్ ఏడాదికి రెండు మూడు సినిమాలు చేయాలని ఎంతగా ప్రయత్నాలు చేసినా, ప్రేక్షకుల ముందుకు ఏడాదికి రెండు మూడు సినిమాలను తీసుకు రావాలని భావించినా కూడా సాధ్యం కావడం లేదు.

ఇతర హీరోలు మెల్లగా సినిమాలు చేస్తూ ఏడాదికి ఒకటి లేదా రెండేళ్లకు ఒకటి సినిమాను చేస్తున్నారు. కానీ ప్రభాస్ మాత్రం ఒకే సారి రెండు మూడు సినిమాలు చేస్తున్నా కూడా ఏదో ఒక సమస్య కారణంగా ఆలస్యం అవుతోంది. సలార్ 2, కల్కి 2 సినిమాలు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. రాజాసాబ్ సినిమా తో పాటు ఫౌజీ సినిమా ఈ ఏడాదిలో వస్తుందని అభిమానులు ఎదురు చూస్తు న్నారు. కానీ అది సాధ్యం అయ్యేలా కనిపిం చడం లేదు.

దాంతో ప్రభాస్‌కే ఎందుకు ఇలా జరుగుతుందని అభి మానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తమ్ముడు సీన్ లోకి వచ్చి అన్నయ్యని టెన్షన్ పెడుతున్నాడా?

ఎప్పుడొచ్చాం కాదన్నయ్యా... బుల్లెట్ దిగిందా? లేదా? అన్నది ఇంపార్టెంట్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇప్పుడు అదే తీరున కనిపిస్తున్నారు. ఆలస్యమైంత కాలం అతడి సినిమాలు సంవత్సరాల పాటు సాగాయి. కానీ పనిగట్టుకుని ఆయన రంగలోకి దిగితే సీన్ ఎలా ఉంటుందో చూపిస్తున్నారు. ఇప్పటికే 'హరిహర వీరమల్లు' షూటింగ్ పూర్తయింది. జూన్ 12న ఆ సినిమా రిలీజ్ అయిపోతుంది. - ఓజీ - షూటింగ్ కూడా షురూ చేసారు. ఆయన సెట్స్ కు వెళ్లడం ఇలా మొదలైందో? లేదో? సెప్టెంబర్ 25న రిలీజ్ అంటూ ప్రకటన వచ్చేసింది. ఆ తేదీకి రిలీజ్ తప్పనిసరి అని యూనిట్ స్ట్రాంగ్ గా చెబుతుంది. ఈ రెండు సినిమాలు భారీ విజయం సాధిస్తాయి? అన్న నమ్మ కం బలంగా ఉంది అలాగే 'ఉస్తాద్ భగత్ సింగ్' ను కూడా రెడీగా ఉండమన్నాడు పవన్ . 'ఓజీ' ముగించిన అనంతరం ఉస్తాద్ ని పట్టాలెక్కిస్తారు. ఇలా ఒక్కసారిగా పీకే సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయిపోయారు. ఈ క్రమంలో చిరంజీవి 'విశ్వంభర' రిలీజ్ ఎప్పుడు? అంటూ పవన్ సినిమాలతో ముడి పెట్టి మాట్లాడటం నెట్టింట మొదలైంది. తమ్ముడు అంటే రాజకీయాల్లో బిజీగా ఉన్నాడు కాబట్టి సినిమాల విషయంలో డిలే జరిగింది. మరి అన్న య్య సినిమా ల్లోనే బిజీగా ఉండి? ఎందుకు 'విశ్వంభర' రిలీజ్ చేయలేకపోతున్నారు? అన్న వాదన తెరపైకి వచ్చింది. జనవరిలో రిలీజ్ అవ్వాల్సిన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ డిలే కారణంగా ఆలస్యమైనా? మరీ ఐదు నెలలు గడిచే వరకూనా? చివరికి చిరంజీవి 157వ సినిమా కూడా పట్టాలెక్కింది. మరి 'విశ్వంభర' ఉంటుందా? ఉండదా? అంటూ కౌంటర్ ఎటాక్ మొదలైంది. ఇంత వరకూ కొత్త రిలీజ్ తేదీని 'విశ్వంభర' టీమ్ ప్రకటించక పోవడంతోనే ఒత్తిడి మొద లైంది. సెప్టెంబర్ ..అక్టోబర్ అంటూ రిలీజ్ విషయంలో ప్రచారం జరుగు తున్నా? అంత వరకూ అంటే అభిమా నులు శాంతించేలా కనిపించలేదు. జూన్ మిస్ అయినా జూలైలో నైనా రిలీజ్ ఉంటుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. ఆ మాసం కూడా మిస్ అయితే మరింత ఒత్తిడి తప్పదని ఫిలిం సర్కిల్స్ లో చర్చకు దారి తీసింది.





## ఇస్మార్ట్ బ్యూటీ అందాల షో



'నన్ను దోచుకుందువటే' సినిమాతో తెలుగులో 2018లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. ఈ కన్నడ బ్యూటీ 2015లో వజ్రకాయ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన విషయం తెల్సిందే. ఆ సినిమాతో కన్నడంలో మంచి గుర్తింపు దక్కించుకుంది. వజ్రకాయ తర్వాత తెలుగులో ఈ అమ్మడు లీ, సాహెబా సినిమాలు చేసింది. ఆ సినిమాలు నభాకు పాజిటివ్ రెస్పాన్స్‌ను తెచ్చి పెట్టాయి. 'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కించుకున్న నభా నటేష్ ఆ తర్వాత అదుగో సినిమాలో నటించింది. ఈ అమ్మడికి లక్కీగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఇస్మార్ట్ శంకర్‌లో ఈమె పోషించిన మాస్ పాత్రకు మంచి మార్కులు దక్కాయి. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో నభా నటేష్‌కి ఇస్మార్ట్ బ్యూటీ అనే పేరు దక్కింది. ఆ సినిమా సూపర్ హిట్ అయినా ఆ వెంటనే కరోనా కారణంగా నభా నటేష్‌కి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. ఇస్మార్ట్ క్రేజ్‌ను నభా నటేష్ పెద్దగా సద్వినియోగం చేసుకోలేక పోయింది. గత ఏడాది డార్లింగ్ అనే వెబ్ మూవీలో నటించడం ద్వారా మరోసారి తన నటన ప్రతిభ కనబర్చింది. అయినా కూడా ఆశించిన స్థాయిలో ఆఫర్లు మాత్రం ఈ అమ్మడు దక్కించుకోవడంలో విఫలం అవుతుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు, వీడియోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ అమ్మడికి ఏకంగా 5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. రెగ్యులర్‌గా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసే అందాల ఆరబోత ఫోటోలకు మంచి రీచ్ దక్కుతూ ఉంటుంది. ఫోటోలు షేర్ చేసిన వెంటనే వేలాది మంది అభిమానులు, ఫాలోవర్స్ లైక్ చేయడంతో పాటు, కామెంట్ చేస్తూ ఉంటారు. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలకు సోషల్ మీడియాలో పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. ఇస్మార్ట్ బ్యూటీ అందాల షోకి చూపు తిప్పుకోలేక పోతున్నాం అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. వైట్ టాప్‌లో నడుము అందం చూపిస్తూ కవ్విస్తున్న ఇస్మార్ట్ బ్యూటీ కవ్వింపులకు అంతా ఫిదా అవుతున్నారు. స్కిన్ షో తో హొయలు పోతున్న ఈ అమ్మడు మరోసారి అందం తో మతి పోగొడుతోంది. ఇంత అందంగా ఉన్న నభా నటేష్‌కి ఇండస్ట్రీలో ఎందుకు ఆఫర్లు రావడం లేదు అంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తూ తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఆ మధ్య ఒక తమిళ సినిమాలో నటించబోతుంది అనే వార్తలు వచ్చాయి. కానీ చివరకు ఆ సినిమాలో ఈమెను తీసుకోకుండానే షూటింగ్ ప్రారంభించారట. తమిళ్‌లోనే కాకుండా ఈమె తెలుగు, కన్నడ సినిమాలో కూడా ఆఫర్లు వస్తాయని ఆశించింది. కానీ ఆఫర్ల విషయంలో ఆమెకు ఎప్పుడూ నిరాశే మిగిలింది.





టాలీవుడ్‌లో చేసిన ప్రతి సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకున్నా కూడా లక్ కలిసి రాకపోవడంతో ఇక్కడ స్టార్‌డం దక్కలేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా పదేళ్లు అవుతున్నా కూడా ఇప్పటి వరకు సరైన బ్రేక్ రాకపోవడంతో ఎదురు చూస్తున్న ఈఅమ్మడు ముందు ముందు అయినా టాలీవుడ్‌తో పాటు, ఇతర సౌత్ భాషల్లో బిజీ అయ్యేనా చూడాలి.



## చెంగారెడ్డిని చూసి అసూయ పడిన విశ్వనటుడు!

లోకనాయకుడు కమల్‌హసన్, దిగ్గజ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో 38 ఏళ్ల క్రితం వచ్చిన నాయకన్ సినిమా అప్పట్లో ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఈ బ్లాక్‌బస్టర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన భారీ బడ్జెట్ సినిమా థగ్ లైఫ్. వచ్చే నెల 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రిలీజ్ అవుతుండడం తెలిసిందే.

రిలీజ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ లో భాగంగా ఆదివారం చెన్నైలో చిత్ర ఆడియో లాంచ్ను నిర్వహించింది. ఈ ఆడియో ఫంక్షన్‌లో కమల్‌హాసన్, జోజూ జార్జ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తనకు ఇరట్ట సినిమాకు ముందు వరకు జోజూ జార్జ్ గురించి పెద్దగా తెలియదని, ఆ మూవీ చూశాక అతడి నటన చూసి ఆశ్చర్యపోయానని చెప్పాడు. ఆ సినిమాలో జోజూ ఎప్పటికి గుర్తుండి పోయే పాత్ర పోషించారని ప్రశం సించాడు. కొందరి నటన చూసి తాను అసూయపడే వారిలో జోజూ కూడా ఒకరని అన్నారు. జోజుకి మంచి భవిష్యత్ ఉందని ఆకాంక్షించాడు. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరికి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించే శక్తి సామర్థ్యాలు ఉన్నాయని కొనియాడాడు. సినిమా అనే దానికి తానొక వీరాభిమాని అని..

అదే సినిమా తనని, మణిరత్నంను మరోసారి దగ్గర చేసిందని కమల్‌హాసన్ తెలిపాడు. నాయకన్ కంటే థగ్ లైఫ్ చిత్రం పెద్ద హిట్ అవుతుందని చెప్పాడు. ఇక థగ్ లైఫ్ మూవీ గురించి మాట్లాడాలంటే ముందు ఏఆర్ రెహమాన్ గురించి చెప్పాల్సిందే అన్నాడు. సంగీతంలో ఇళయరాజా తర్వాత తనను ఆస్థాయిలో ఆకట్టుకుంది రెహమాన్ అని ఆకాశానికెత్తాడు. వీరిద్దరూ తమ సంగీతంతో దక్షిణ భారతదేశం గర్వించేలా చేశారని ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ సినిమాలో హీరో శింబు, త్రిషా అద్భుతమైన పాత్రలు పోషించారని అన్నాడు. శింబు భవిష్యత్‌లో ఇతరులకు మార్గదర్శనం చేసే ఒక నాయకుడిగా ఎదుగుతాడని కమల్ జోస్యం చెప్పాడు. త్రిష చూడ్డానికి మాత్రమే అందగత్తె కాదని, ఆమె మనకు కూడా చాలా గొప్పదని పొగడ్తలు కురిపించాడు. మరో నటి అభిరామి కూడా ఈ సినిమాలో బలమైన పాత్ర పోషించారని తెలిపాడు. శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్న ఈ సినిమా విజయంపై కమల్ హాసన్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు.



## తమ్ముడు సీన్ లోకి వచ్చి అన్నయ్యని టెన్షన్ పెడుతున్నాడా?

ఎప్పుడొచ్చాం కాదన్నయ్యా...బుల్లెట్ దిగిందా? లేదా? అన్నది ఇంపార్టెంట్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇప్పుడు అదే తీరున కనిపిస్తున్నారు. ఆలస్యమైంత కాలం అతడి సినిమాలు సంవత్సరాల పాటు సాగాయి. కానీ పనిగట్టుకుని ఆయన రంగలోకి దిగితే సీన్ ఎలా ఉంటుందో చూపిస్తున్నారు. ఇప్పటికే 'హరిహర వీరమల్లు' షూటింగ్ పూర్తయింది. జూన్ 12న ఆ సినిమా రిలీజ్ అయిపోతుంది. - ఓజీ - షూటింగ్ కూడా షురూ చేసారు. ఆయన సెట్స్ కు వెళ్లడం ఇలా మొదలైందో? లేదో? సెప్టెంబర్ 25న రిలీజ్ అంటూ ప్రకటన వచ్చేసింది. ఆ తేదీకి రిలీజ్ తప్పనిసరి అని యూనిట్ స్ట్రాంగ్ గా చెబుతుంది. ఈ రెండు సినిమాలు భారీ విజయం సాధిస్తాయి? అన్న నమ్మ కం బలంగా ఉంది అలాగే 'ఉస్తాద్ భగత్ సింగ్' ను కూడా రెడీగా ఉండమన్నాడు పవన్ . 'ఓజీ' ముగించిన అనంతరం ఉస్తాద్ ని పట్టాలెక్కిస్తారు. ఇలా ఒక్కసారిగా పీకే సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయిపోయారు. ఈ క్రమంలో చిరంజీవి 'విశ్వంభర' రిలీజ్ ఎప్పుడు? అంటూ పవన్ సినిమాలతో ముడి పెట్టి మాట్లాడటం నెట్టింట మొదలైంది. తమ్ముడు అంటే రాజకీయాల్లో బిజీగా ఉన్నాడు కాబట్టి సినిమాల విషయంలో డిలే జరిగింది. మరి అన్నయ్య సినిమా ల్లోనే బిజీగా ఉండి? ఎందుకు 'విశ్వంభర' రిలీజ్ చేయలేకపోతున్నారు?

అన్న వాదన తెరపైకి వచ్చింది. జనవరిలో రిలీజ్ అవ్వాల్సిన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ డిలే కారణంగా ఆలస్యమైనా? మరీ ఐదు నెలలు గడిచే వరకూనా? చివరికి చిరంజీవి 157వ సినిమా కూడా పట్టాలెక్కింది. మరి 'విశ్వంభర' ఉంటుందా? ఉండదా? అంటూ కౌంటర్ ఎటాక్ మొదలైంది. ఇంత వరకూ కొత్త రిలీజ్ తేదీని 'విశ్వంభర' టీమ్ ప్రకటించకపోవడంతోనే ఒత్తిడి మొదలైంది. సెప్టెంబర్ ..అక్టోబర్ అంటూ రిలీజ్ విషయంలో ప్రచారం జరుగు తున్నా? అంత వరకూ అంటే అభిమానులు శాంతించేలా కనిపించలేదు. జూన్ మిస్ అయినా జూలైలో నైనా రిలీజ్ ఉంటుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. ఆ మాసం కూడా మిస్ అయితే మరింత ఒత్తిడి తప్పదని ఫిలిం సర్కిల్స్ లో చర్చకు దారి తీసింది.